జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

**WANTED**

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

రంగారెడ్డి | మంగళవారం 28 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 275 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

## తెలంగాణలో మరోసారి పెట్రోల్ కొరత!



- బంకుల వద్ద బారులుతీరిన వాహనదారులు
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత
- స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల్లో బారులు తీరిన వాహనదారులు
- గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మరోసారి పెట్రోల్, డీజిల్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. రాత్రి నుంచి పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ కొరత వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల్లో పెద్ద సంఖ్యలో బారులు తీరారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో కొన్నాళ్లుగా సీఎన్‌జీ కొరత కొనసాగుతోంది. సీఎన్‌జీ కోసం బంకుల ముందు ఆటోలు బారులు తీరాయి. పలు జిల్లాల్లోనూ పెట్రోల్, డీజిల్ - మిగతా3లో

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, మంత్రి అజారుద్దీన్ ప్రమాణస్వీకారం

- ప్రమాణస్వీకారం చేయించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ప్రమాణ స్వీకారానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు





## బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

- పోలింగ్‌కు ఈసీ ఏర్పాట్లు
- ఈనెల 29న రెండో విడతలో భాగంగా 142 స్థానాలకు పోలింగ్

2

## బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదు



- 'కేసీఆర్ పార్టీకే మనుగడ లేదు
- కొత్త పార్టీ సంగతి తర్వాత'
- కవిత కొత్త పార్టీపై స్పందించిన సీఎం
- 'కొత్త పార్టీ సంగతి తరువాత ఉన్న పార్టీ ఉంటుందా ఊడుతుందా?
- ఉద్యమం అప్పుడు ఎలా మాట్లాడినా సహించారు'
- చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి


హైదరాబాద్

కవిత కొత్త పార్టీ (తెలంగాణ రాష్ట్ర సేన) ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కొత్త పార్టీ సంగతి తరువాత, ముందు ఉన్న పార్టీ (బీఆర్ఎస్) ఉంటుందా ఊడుతుందా కేసీఆర్ పార్టీకే మనుగడ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది తప్ప, భవిష్యత్ లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం అప్పుడు వారు ఎలా మాట్లాడినా సహించారన్న ఆయన, అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారని అన్నారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేవని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటేనని, రంగు, రుచి లేదని వ్యాఖ్యానించారు. వారు నటిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి అని, ఆయన చావును తానేందుకు కోరుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. ఆయన - మిగతా3లో

## రైతులు, యువత, స్టార్టప్‌లకు చాలా మేలు

- భారత్, న్యూజిలాండ్ సంబంధాల్లో ఇదో గొప్ప రోజు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఇరుదేశాల అభివృద్ధి మరింత వేగవంతం
- "భారత్-న్యూజిలాండ్ భాగస్వామ్యంలో ఈ రోజు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన రెండు దేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుంది : ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

2





## లద్దాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటు

- అమిత్ షా పర్యటన వేళ ఆమోదం
- కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు
- లద్దాఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరుగుదల

2

## బీజేపీలోకి ఏడుగురు ఆప్ ఎంపీలు

- రాజ్యసభ ఛైర్మన్ పచ్చజెండా
- 113కి చేరిన కమలదళ బలం
- రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కీలక నిర్ణయం
- బీజేపీలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి అనుమతి

2

## రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయింది



- రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావట్లేదు
- మా ఎంపీలు ఉండుంటే రణరంగం సృష్టించే వాళ్లు : కేసీఆర్
- తెలంగాణలో ఏం జరుగుతోందో అర్థం కావట్లేదని వ్యాఖ్య
- తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారన్న మాజీ ముఖ్యమంత్రి

హైదరాబాద్

తెలంగాణ ఏర్పాటు గురించి కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని మాజీ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదని, బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లని హెచ్చరించారు. కాళేశ్వరంపై రాజ్యసభలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడితే బీఆర్ఎస్ పక్షనేత సురేశ్ రెడ్డి గట్టిగా ఖండించారని గుర్తు చేశారు. తెలంగాణ గురించి బీజేపీ ఎంపీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తనను ఎన్నోసార్లు, ఎంతో మంది మానసిక క్షోభకు గురిచేశారన్న కేసీఆర్, హైదరాబాద్ విషయంలో రాజీపడాలని సోనియాగాంధీ ఎన్నోసార్లు - మిగతా3లో



## అడవి జిల్లాలో భానుడి భగభగలు

- 45 డిగ్రీలు దాటుతోన్న ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా 45.3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతల నమోదు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రత
- జిల్లాలో అనేక ప్రాంతాల్లో వడగాలులు నమోదైనట్లు గుర్తించిన వాతావరణ శాఖ

హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎండల వేడికి భగ్గుమంటోంది. కొద్ది రోజులుగా ఇక్కడి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదవుతూ ప్రజలను భయపెడుతున్నాయి. ఆదివారం ఏకంగా సాధారణం కన్నా 3.5 డిగ్రీలు అధికంగా 45.3 డిగ్రీల వరకు నమోదయింది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వడగాలులు నమోదైనట్లు వాతావరణ శాఖ (ఐఎండీ) గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమ, మంగళవారాల్లో సాధారణం కంటే అధికంగా రెండు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం - మిగతా3లో

# రైతులు, యువత, స్టార్టప్‌లకు చాలా మేలు




భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్–న్యూజిలాండ్ సంబంధాల్లో ఇదో గొప్ప రోజు అని, ఇది ఇరుదేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని అన్నారు. "భారత్–న్యూజిలాండ్ భాగస్వామ్యంలో ఈ రోజు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన రెండు దేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుంది. ఇది మన మధ్య ఉన్న నమ్మకాన్ని, ఉమ్మడి విలువలను, ఆశయాలను ప్రతిబింబిస్తోంది. ఈ ఒప్పందం వల్ల మన రైతులు, యువత, మహిళలు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తులవారు, స్టార్టప్‌లు, విద్యార్థులు, ఆవిష్కర్తలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇది అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుంది. సరికొత్త అవకాశాలను సృష్టిస్తుంది. వివిధ రంగాల్లో మన సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తుంది. న్యూజిలాండ్ పెట్టనున్న 20 బిలియన్ డాలర్ల (రూ.1.6 లక్షల కోట్లు) పెట్టుబడితో మన వ్యవసాయం, తయారీ, టెక్నాలజీ రంగాలకు మేలు జరుగుతుంది. ఇది ఇరుదేశాలకు మరింత సుసంపన్నమైన, చైతన్యవంతమైన భవిష్యత్‌కు మార్గాన్ని సుగమం చేస్తుంది" అని పేర్కొన్నారు.

**ఇది జస్ట్ ఆరంభం మాత్రమే!**

మరోవైపు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కూడా భారత్?తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. "భారత్, న్యూజిలాండ్ సంబంధాల్లో చరిత్రాత్మకమైన మైలురాయిని చేరుకున్నాం. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇవాళ ఇరుదేశాలు సంతకాలు చేశాయి. కేవలం 13 నెలల క్రితమే నేను భారత్? పర్యటనకు వెళ్లి, ప్రధాని మోదీతో భేటీ అయ్యి, ఈ ఎఫ్?టీఏ గురించి చర్చించాను. ప్రపంచంలోనే అతిపెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్? ఒకటి. అయితే మన ఇరుదేశాల వాణిజ్య సంబంధాలు ఇంకా ప్రాథమిక స్థాయిలో ఉన్నాయి. అయితే తాజాగా కుదిరిన ఒప్పందం ఇరుదేశాలకు ఒక గొప్ప అవకాశమని నేను, మోదీ గుర్తించాం. గత మార్చి నెలలో నా పర్యటన జరిగినప్పటి నుంచి మంత్రులు పీయూశ్? గోయెల్?, టాడ్? మెక్?క్లే, అలాగే వారి అధికారుల బృందం ఈ ఒప్పందం కోసం అవిశ్రాంతంగా శ్రమించారు. ఈ కఠోర శ్రమ ఫలితంగానే ఇరుదేశాలకు మేలు చేసే ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. అందుకే దీనిలో భాగస్తులుగా ఉన్న వారందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను.

న్యూజిలాండ్ విషయానికి వస్తే, ఈ ఒప్పందం ప్రపంచంలోనే అత్యంత క్రియాశీలక మార్కెట్లలో ఒకటైన భారత్?కు ద్వారాలు తెరుస్తుంది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, అనుసంధానత రంగాల్లో అపూర్వమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఇది మా ఎగుమతుల పరిధిని విస్తృతం చేయడమే కాకుండా, రానున్న పదేళ్లలో ఎగుమతుల విలువను రెట్టింపు చేయాలనే మా లక్ష్యానికి తోడ్పడుతుంది. భారత్?లో ఇప్పటికే చాలా ప్రయోజనాలను పొందుతున్న, ఇతర పోటీదారులతో సమానంగా మా ఎగుమతిదారులు పోటీపడడానికి ఇది ఒక సమతుల్యమైన వేదికను కల్పిస్తుంది. ఇక భారతదేశానికి సంబంధించి, ఈ ఒప్పందం వృద్ధి, ఆవిష్కరణ, కొత్త అవకాశాలకు అవకాశం కల్పిస్తుంది. ఇది భారత ఎగుమతి దారులకు మొదటి రోజు నుంచే న్యూజిలాండ్ మార్కెట్లోకి ఎలాంటి సుంకాలు లేకుండా ప్రవేశించే అవకాశాన్ని అందిస్తుంది. అలాగే భారతీయ వినియోగదారులకు మా నాణ్యమైన ఉత్పత్తులు సులభంగా అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయ ఉత్పాదకత పెంచేందుకు న్యూజిలాండ్?కు చెందిన ప్రపంచస్థాయి అగ్రి–టెక్?, ఆహార ఉత్పత్తి నైపుణ్యాలను భారత్ వినియోగించుకోవడానికి ఇది కొత్త మార్గాలను సృష్టిస్తుంది. ఈ ఒప్పందం కేవలం ఆర్థిక అంశాల కోసమే కాకుండా, వ్యూహాత్మకంగా కూడా చాలా ముఖ్యమైనది. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో స్థిరమైన, పారదర్శకమైన, నిబంధనలతో కూడిన వాణిజ్యానికి రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయని ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది. భారత్?–న్యూజిలాండ్ బంధం కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాదు. పెట్టుబడులు, రక్షణ, క్రీడలు, ఆవిష్కరణ వంటి రంగాల్లో కూడా మన సంబంధాలు ఏటా మరింత లోతుగా, పటిష్టంగా మారుతున్నాయి. ఇక న్యూజిలాండ్?లో ఉన్న ప్రవాస భారతీయులు మన రెండు దేశాల మధ్య సంబంధాలకు కేంద్ర బిందువుగా ఉన్నారు. ప్రధాని మోదీ మాటల్లో చెప్పాలంటే, ఈ ప్రవాస భారతీయులు ఇండియా, న్యూజిలాండ్ మధ్య ఒక సజీవ వారధిగా ఉన్నారు. వ్యాపారం, విజ్ఞానం, విద్య, ఆరోగ్యం, కళలు, క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో న్యూజిలాండ్?కు భారత సమాజం అందిస్తున్న సహకారం అపారమైనది. వాస్తవానికి నేడు కుదిరిన ఈ ఒప్పందం ఒక గొప్ప మైలురాయి అయినప్పటికీ, ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇరుదేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కావడంపై మేము ఎంతో ఉత్సాహంగా ఉన్నాం" అని ఆయన అన్నారు.

# బీజేపీలోకి ఏడుగురు ఆప్ ఎంపీలు



బీజేపీలోకి ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీల విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అధికారికంగా అనుమతించారు. దీంతో పెద్దల సభలో బీజేపీ సంఖ్యాబలం 106 నుంచి 113కు పెరిగింది. ఇక ఇదే సమయంలో రాజ్యసభలో ఆప్ ఎంపీల సంఖ్యాబలం 3కు తగ్గిపోయింది. రాజ్యసభ ఛైర్మన్ తాజా నిర్ణయం అనంతరం విడుదల చేసిన ఒక నోటిఫికేషన్‌లో ఈ వివరాలను ప్రస్తావించారు. రాజ్యసభ అధికారిక వెబ్‌సైట్‌లోనూ బీజేపీ ఎంపీల జాబితాలో ఈ ఏడుగురు ఆప్ ఎంపీల పేర్లను పొందుపరిచారు. బీజేపీలో విలీనమైన ఏడుగురు ఆప్ ఎంపీల్లో రాఘవ్ చడాధ, సందీప్ పాఠక్, అశోక్ కుమార్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలీవాల్, రాజీందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ ఉన్నారు. ఇప్పుడు రాజ్యసభలో మిగిలిన ఆప్ ఎంపీల్లో సంజయ్ సింగ్ (దిల్లీ), ఎన్ డీ గుప్తా (దిల్లీ), బల్బీర్ సింగ్ సీచేవాల్ (పంజాబ్) ఉన్నారు. బీజేపీలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనాన్ని రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేశారు. ఇక నుంచి రాఘవ్ చడాధ, సందీప్ పాఠక్, అశోక్ కుమార్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలీవాల్, రాజీందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ సభ్యులని ఆయన వెల్లడించారు. ఈ ఏడుగురు ఎంపీలు ఎన్నడూ రాజ్యసభలో దూషణలు చేయలేదన్నారు. క్రమశిక్షణారాహిత్యం, అసమంజస ప్రవర్తనలకు వారు పాల్పడలేదని కిరణ్ రిజిజు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశ నిర్మాణం చేస్తున్న ఎన్‌డీఏ కూటమిలోకి ఆ ఎంపీలకు స్వాగతం పలుకుతున్నానని ఆయన తెలిపారు. 'తుక్డే తుక్డే ఇండి అలయన్స్'కు ఇక వీడ్కోలు అని వ్యాఖ్యానించారు.

**ఫిరాయింపు ఎంపీలు : ఆప్**

రాఘవ్ చడాధ సారథ్యంలో ఆప్ ఎంపీలు కలిసి శుక్రవారం రోజే (ఏప్రిల్ 24న) బీజేపీలో చేరారు. తామంతా ఆప్ పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు వారు వెల్లడించారు. ఏడుగురు ఆప్ ఎంపీలతో కూడిన తమ వర్గాన్ని బీజేపీలో విలీనం చేయాలని అదే రోజున రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు వినతిపత్రాన్ని అందించారు. రాజ్యసభలోని ఆప్‌నకు చెందిన మొత్తం 10 మంది ఎంపీల్లో మూడింట రెండోవంతు మంది (ఏడుగురు) కలిసికట్టుగా ఉన్నందున ఈ విలీనం రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందని వారు వాదించారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు అనేది తమ ఏడుగురికి వర్తించదని రాజ్యసభ ఛైర్మన్‌కు తెలిపారు.

ఇక తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఏడుగురు ఎంపీల రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం రోజు రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఒక పిటిషన్‌ను సమర్పించారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయాలని ఆయన కోరారు. పార్టీ ఫిరాయించే లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల సంఖ్య మూడింట రెండో వంతు ఉన్నా, ఆ సమూహానికి చట్టపరమైన గుర్తింపు దక్కదన్నారు. అయితే ఏడుగురు ఆప్ ఎంపీల విలీన విన్నపానికే రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలపడం గమనార్హం.

**కీలక వ్యాఖ్యలతో రాఘవ్ చడాధ ఎగ్జిట్**

ఆప్ నుంచి వైదొలిగే వేళ ఎంపీ రాఘవ్ చడాధ కీలక వ్యాఖ్యలు చేశారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన ఆశయాలు, సూత్రాలు, విలువలు, నైతికత నుంచి దారి తప్పిందని ఆయన ఆరోపించారు. అవినీతి వ్యతిరేక పోరాటాన్ని ఆప్ వదిలేసిందన్నారు. అందుకే తాను బీజేపీలో చేరుతున్నానని చడాధ వెల్లడించారు. తాను ఇన్నాళ్లూ తప్పుడు పార్టీలో ఉన్న సరైన వ్యక్తిని అని ఆయన వ్యాఖ్యానించారు. ఆప్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం తగ్గిందని, కేవలం కొందరి నిర్ణయాలకే ప్రాధాన్యం ఉంటుందని విమర్శించారు. దీనిపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందిస్తూ, ఫిరాయించిన ఏడుగురు ఎంపీలను ద్రోహులుగా అభివర్ణించారు. ఆప్‌ను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు బీజేపీ ద్రోహం చేసిందన్నారు.

# బ్రిటిష్ కాలం నాటి స్కూల్

# 145 ఏళ్లనాటి చరిత్రకు సాక్ష్యం

కొన్ని పురాతన ప్రదేశాలు, భవనాలు కేవలం ఒక ప్రసిద్ధ కట్టడంలా మిగలి ఉండవు. అవి తమలో ఎంతో గొప్ప చరిత్ర, విశిష్టతను దాచి ఉంచుకుంటాయి. సరిగ్గా అలాంటిదే ఉత్తర్?ప్రదేశ్‌లో ఉన్న ఓ పూర్వ మాధ్యమిక విద్యాలయం కూడా. బ్రిటిష్ పాలన కాలంలో స్థాపించిన ఆ పాఠశాల, ఒకటిన్నర శతాబ్దానికి పైగా చరిత్రను తనలో నిక్షిప్తం చేసుకుని నేటికీ నిలువెత్తు చరిత్ర పుస్తకంలా నిలిచింది. మరి ఆ పాఠశాల వెనుక ఉన్న చరిత్ర ఏమిటో తెలుసుకుందాం.

**1883లో మొదలైన తరగతులు**

గాజియాబాద్‌లోని ఈ పాఠశాలను 1881లో స్థాపించారు. అయితే అంతక ముందు ఇది బ్రిటిష్ అధికారులకు అతిథి గృహంగా ఉండేది. ఈ స్కూల్? తొలుత 'టౌన్ స్కూల్' పేరుతో ప్రసిద్ధి చెందింది. 1883లో ఇందులో అధికారిక తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఈ సంస్థ విద్యా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకోవడం ప్రారంభించింది. ప్రస్తుతం దీనిని 'పూర్వ మాధ్యమిక విద్యాలయ్ రైట్‌గంజ్, నగర్ క్షేత్ర, గాజియాబాద్'గా పిలుస్తున్నారు.

**వివిధ ప్రాంతాల విద్యార్థులకు ఏకైక కేంద్రం**

పాఠశాల ప్రారంభమైనప్పుడు గాజియాబాద్ మేరఠ్? జిల్లాకు చెందిన ఒక మండలం మాత్రమే. దాదరీ, ధౌలానా, మోదీనగర్‌లోనీ తదితర ప్రాంతాల నుంచి పిల్లలు ఇక్కడికి వచ్చి చదువుకునేవారు. ఆ కాలంలో విద్యాసౌకర్యాలు పరిమితంగా ఉండడంతో, వెయ్యికి పైగా విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకోవడం విశేషంగా నిలిచింది. అలాగే ఈ స్కూల్లో చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాలలో స్థిరపడ్డారు.

**విద్యార్థులకు వసతి సౌకర్యం**

బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఈ పాఠశాలలో విద్యార్థుల కోసం వసతి గృహం కూడా ఉండేది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు అక్కడే నివసిస్తూ చదువుకునేవారు. మొత్తం నాలుగు భవనాలతో ఈ విద్యాసంస్థను నిర్మించారు. వాటిలో రెండు భవనాల్లో తరగతులు నిర్వహించగా, ఒకటి హాస్టల్‌గా, మరొకటి ప్రధానోపాధ్యాయుడి నివాసంగా ఉపయోగించేవారు. ఈ నిర్మాణంతో ఆ కాలంలో కూడా విద్యను ఒక క్రమపద్ధతి, క్రమశిక్షణతో నిర్వహించేవారని స్పష్టంగా తెలియజేస్తుంది.

**ఎండాకాలంలోనూ చల్లగా ఉండేలా**

బ్రిటిష్ కాలం నాటి ఈ భవనం నిర్మాణ శైలి ఓ ప్రత్యాక ఆకర్షణగా నిలుస్తోంది. ఎందుకంటే ప్రతి తరగతి గదిని వేసవిలో కూడా చల్లగా ఉంచేలా రూపొందించారు. అలా చల్లగా ఉండేందుకు పైభాగం, దిగువ భాగంలో స్కైలైట్? నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. దాని వల్ల సహజ వెంటిలేషన్? ఉంటుంది. దాంతో ఫ్యాన్‌లు, కూలర్లు లేకున్నా గదుల్లో చల్లదనం నిలుస్తుంది. నేటికీ ఈ పాత తరగతి గదుల్లోకి అడుగుపెడితే వేసవిలోనూ ఆహ్లాదకరమైన చల్లదనం అనుభూతి చెందవచ్చు.

**ఉర్దూలో నమోదైన విద్యార్థుల రికార్డులు**

ఈ స్కూల్ పాత రిజిస్టర్లలో విద్యార్థుల వివరాలు ఉర్దూ భాషలో నమోదు చేశారు. ఈ రికార్డులు పాఠశాల చరిత్రను సజీవంగా నిలుపుతున్నాయి. 1998 నుంచి 2012 వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన జగదీశ్ శరణ్ శర్మ, ఈ పాత రికార్డ్స్?ను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకు గాను రాష్ట్రపతి పురస్కారం కూడా అందుకున్నారు.

**ఇప్పటివరకు 14 మంది ప్రధానోపాధ్యాయులు**

ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు లయీక్ అహ్మద్ కూడా ఈ చారిత్రక వారసత్వాన్ని సంరక్షించేందుకు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఈ పాఠశాలలో ఇప్పటివరకు 14 మంది ప్రధానోపాధ్యాయులు సేవలందించారు. వారిలో ప్రతి ఒక్కరూ సంస్థ పురోగతి కోసం కృషి చేశారని చెప్పారు. అలాగే వారి పేర్లన్నీ ప్రధానోపాధ్యాయుడి గదిలో ప్రత్యేకంగా ప్రదర్శించారని అన్నారు.

**బహుభాషా, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా**

పాఠశాల లోపల హిందీ, ఉర్దూ భాషల్లో సైన్‌బోర్డులు ఉంటాయి. అలాగే వెలుపల సంస్కృతంలో శ్లోకాలు కనిపిస్తాయి. ఇది ఈ విద్యాసంస్థ బహుభాషా, బహుసాంస్కృతిక సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ పాఠశాలలో తొలి ప్రవేశం పొందింది 'గోపాల్' అనే విద్యార్థి అని పాత రికార్డులు తెలియజేస్తున్నాయి.

**శిథిలావస్థకు చేరినా మారని వైభవం**

బ్రిటిష్ పాలనలో నిర్మించిన ఈ చారిత్రాత్మక భవనం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. దాంతో ఈ పాఠశాలను నడపడం ప్రమాదకరంగా మారింది. అలా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 2001లో ప్రభుత్వం కొత్త భవనాన్ని నిర్మించింది. అనంతరం పాఠశాల కార్యకలాపాలను కొత్త భవనానికి మార్చారు. అయినప్పటికీ పాత భవనం నేటికీ నిలిచి తన చారిత్రక వైభవాన్ని గుర్తుచేస్తోంది. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఇప్పటికీ అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి తమ విద్యార్థి దశను గుర్తుచేసుకుంటారు. వారికి ఇది కేవలం ఒక భవనం కాదు, జీవితంలోని అమూల్య జ్ఞాపకాలను మోసుకెళ్తున్న ఓ చారిత్రక నిలయం. ముఖ్యంగా, బ్రిటిష్ కాలం నుంచి నేటివరకు విద్యార్థుల ప్రవేశ రికార్డులు సురక్షితంగా భద్రపరచబడటం ఈ విద్యాసంస్థ ప్రత్యేకతను మరింత పెంచుతోంది.

## లద్దాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటు



కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో పరిపాలనా సంస్కరణల దిశగా కీలక అడుగు పడింది. ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ లద్దాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. వీటి ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇదొక చరిత్రాత్మక రోజు అని అభివర్ణించియన ఆయన, ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు లద్దాఖ్‌లో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో లద్దాఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరగనుంది. లేహ్ జిల్లా నుంచి నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్ అనే మూడు జిల్లాలను ఏర్పాటు చేయగా, కార్గిల్ జిల్లా నుంచి జాన్స్కర్, ద్రాస్ అనే రెండు జిల్లాలను ఏర్పాటు చేశారు. విస్తీర్ణం పరంగా అతిపెద్ద కేంద్రపాలిత ప్రాంతమైనప్పటికీ, జనాభాలో రెండో అతి తక్కువ స్థానంలో ఉన్న లద్దాఖ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం దీని విస్తీర్ణం 86,904 చదరపు కిలోమీటర్లు ఉండగా జనాభా 2.74 లక్షలుగా ఉంది.

పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరగడంతో పాటు వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని సక్సేనా తెలిపారు. ఈ నిర్ణయంతో లద్దాఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, 2024 అగస్టులో వెల్లడించారు. త్వరలోనే హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల ష్టటు పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆ ఐదు జిల్లాలను ఏర్పాటు చేస్తూ లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారు. "లద్దాఖ్ ప్రజల ఆకాంక్షలను, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను నెరవేరుస్తూ లద్దాఖ్?లో ఐదు కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేను ఆమోదించాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి చెందిన, సంపన్న లద్దాఖ్ దార్శనికతకు అనుగుణంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో 2024 ఆగస్టులోనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఈ నిర్ణయం క్షేత్రస్థాయి పాలనను బలోపేతం చేస్తుంది. పరిపాలనను వికేంద్రీకరించి లద్దాఖ్ ప్రజలకు, ముఖ్యంగా మారుమూల, సుదూర ప్రాంతాల వారికి ప్రజా సేవలను వేగంగా అందించేలా చూస్తుంది. కొత్త జిల్లాల ఏర్పాటు, పాలనను పౌరులకు చేరువ చేయడమే కాకుండా, అభివృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలను సృష్టిస్తుంది. మనం కలిసికట్టుగా ఉజ్వలమైన, బలమైన, సుసంపన్నమైన భవిష్యత్తు వైపు పయనిస్తున్నాం. ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల లద్ధాఖ్?లోని ప్రతి పౌరుడు ప్రయోజనం పొందేలా చూస్తాను."

**రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్ము కశ్మీర్**

2019 ఆగస్టు 5న అప్పటి జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్ము కాశ్మీర్, లద్దాఖ్‌గా విభజించింది కేంద్ర ప్రభుత్వం. అదే సమయంలో ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని కూడా రద్దు చేసింది. శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా లద్దాఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పాలనలో ఉంది.

## బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఫలితంగా మైకులు మూగబోయాయి. చివరి వరకు ప్రధాన పార్టీలు ప్రచార సభలతో హోరెత్తించాయి. ఎన్నికల హామీలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశాయి. ఈనెల 29న రెండో విడతలో భాగంగా 142 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం 1448 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వారిలో సీఎం మమత బెనర్జీ సహా ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు సువేందు అధికారి ఉన్నారు. వారిద్దరూ భవానీపూర్ నుంచి తలపడుతున్నారు.

## 'బిడ్డను కని ఇప్పుడేమో అత్యాచారమంటూ పిటిషన్, ఇదంతా ఏంటి?'- సహజీవనంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

సహజీవనం విషయంలో సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేనప్పుడు సహజీవన భాగస్వామి నుంచి విడిపోవడం నేరం కాదని స్పష్టం చేసింది. పెళ్లి పేరుతో నమ్మించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తనకు 18 ఏళ్ల వయసు అప్పుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని, అప్పటికే అతనికి నలుగురు భార్యలున్నా ఆ విషయం దాచిపెట్టాడని బాధితురాలు తెలిపారు. అయితే కోర్టు కేవలం పిటిషనర్ పెట్టిన కేసుపైనే దృష్టి పెడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. వివాహం లేకుండా కలిసి ఉండాలనుకుంటే, అలాంటి సంబంధాల్లో సహజంగానే కొన్ని ముప్పులు ఉంటాయని జస్టిస్ నాగరత్న ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఏకాభిప్రాయంతో కలిసి ఉండి, బిడ్డను కూడా కన్న తర్వాత ఆ బంధం విచ్ఛిన్నం కాగానే అత్యాచారం వంటి క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ బంధం వల్ల పుట్టిన బిడ్డ కోసం మాత్రం మహిళ పోషణ ఖర్చులను కోరవచ్చని సూచించింది. ఒకవేళ వివాహం జరిగి ఉంటే, ఆమె హక్కులు మరింత మెరుగ్గా ఉండేవని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరుపక్షాలకు సూచించారు. "ఈ కేసు సహజీవన బంధానికి సంబంధించినది. వివాహం కాకుండానే ఆ మహిళ ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోంది. ఇదంతా ఏంటి? సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారింది? కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నారు. పెళ్లి ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవి" అని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, పిటిషనర్? తరఫున న్యాయవాది తన వాదనలు వినిపించారు. నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయసు 18 ఏళు అని పేర్కొన్నారు. అప్పుడు ఆమె ఒక వితంతువని, అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిందని తెలియజేశారు. అయితే, ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని, ఇతర మహిళలను ఇలాగే మోసగించాడని తెలిపారు. అయితే, ఈ వాదనలు విన్న న్యాయమూర్తి, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులుగా కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించారంటూ ప్రశ్నించారు. అలాగే బాధిత మహిళ పరిస్థితిపై సానుభూతి వ్యక్తంచేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని ఆయన సూచించారు. వివాహేతర సంబంధాలు ఉండొచ్చు, కానీ అలాంటి బంధాల వల్ల జన్మించిన పిల్లలు వివాహేతర సంతానం కాదని స్పష్టం చేశారు. పెళ్లి జరిగిఉంటే చట్టపరంగా ఆమె పరిస్థితి మెరుగ్గా ఉండేదని వ్యాఖ్యానించారు. ఇరువర్గాలు ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలోనూ సహజీవన సంబంధాలపై అలహాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వివాహితుడైన పురుషుడు వయోజనురాలైన మహిళతో పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం చట్టప్రకారం నేరం కాదని స్పష్టం చేసింది. ఎలాంటి నేరం జరగనప్పుడు పౌరుల హక్కులను పరిరక్షించే కోర్టు చర్యలకు సామాజిక అభిప్రాయాలు, నైతికత మార్గదర్శకం కావని జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. తాను ఇష్టపూర్వకంగా, స్వేచ్ఛతోనే ఆ వ్యక్తితో కలిసి జీవిస్తున్నానని ఆ మహిళ పోలీసు సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని సమర్పించినట్లు గుర్తు చేసింది.

# రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయింది

-మొదటిపేజీ తరువాయి

చెప్పారని గుర్తుచేశారు. సోనియాగాంధీ ఎన్నోసార్లు చెప్పినా తాను రాజీపడలేదని, అది తన చిత్తశుద్ధి అని స్పష్టం చేశారు. ప్రజలకు ఇన్ని కార్యక్రమాలు చేసినా ఎందుకు ఓడామో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 60 లక్షల సభ్యత్వాలు ఉన్నా ఎందుకు ఓడిపోయామో ఆత్మ విమర్శ చేసుకోవాలన్న ఆయన రాశి కాదు వాసి ముఖ్యమన్నారు.

**రాజీనామా చేయమంటే పారిపోయారు**

సింగరేణి కార్మికులకు అన్నీ చేసినా ఆ ప్రాంతంలో ఓడిపోయామన్న కేసీఆర్ కాంగ్రెస్ నేతలు అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు విసుగు చెందారని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయాలంటే కిషన్‌రెడ్డి పారిపోయారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేతకావట్లేదని కేసీఆర్ ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావట్లేదని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారని, ఇది ఒక చిల్లర ప్రభుత్వం, ఆ మాటలు ఏంటి? అని దుయ్యబట్టారు. తెలంగాణను కాంగ్రెస్ నాయకులు పెంటకుప్పగా మార్చారని మండిపడ్డారు.

అన్ని కమిటీల రద్దు : బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ మినహా మిగతా



అన్ని కమిటీలు రద్దు చేస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో సాధారణ సభ్యత్వానికి రూ.10 రుసుము, క్రియాశీల సభ్యత్వానికి రూ.50లుగా నిర్ణయించారు.

రాష్ట్రంలో పండిన పంటలన్నీ కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తీర్మానం చేసింది. మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పండిన పంటలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. పంటల కొనుగోళ్లపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. రైతులకు పూర్తి అండగా నిలవాలని చెప్పారు. సభ్యత్వం కోసం ప్రతి జిల్లాకు ఒక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించారు.

# తెలంగాణలో మరోసారి పెట్రోల్ కొరత!

-మొదటిపేజీ తరువాయి

దొరకటం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాల్లోనూ పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పెట్రోల్ లభ్యత ఉండగా, డీజిల్‌కు కొరత ఉంది.

**సమస్యను త్వరగా పరిష్కరించాలని వేడుకోలు**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రాత్రి నుంచి అనేక పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో లేకపోవడంతో బంకులు మూసివేశారు. దీంతో ఉద్యోగులు, ఇతర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన వారు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకుల్లో మాత్రమే ఇంధనం లభించడంతో ఆ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. క్యూలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇంధన సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలో 12 పెట్రోల్ బంక్?లు ఉండగా ఉదయం నుంచి అన్ని బంక్?లలో నో స్టాక్ అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో లారీలు, ట్రాక్టర్లు, రైతులు, వ్యాపారులు, క్రషర్ మిల్లులు, వరి కోత, మొక్క జొన్న నూర్పిడి యంత్రాల దారులు ఇబ్బందులు పడుతున్నారు. తమ వద్ద నిల్వ చేసుకున్న డీజిల్ అయిపోవడంతో వ్యవసాయ, ఆర్థిక కార్యకలాపాలు ఎక్కడి



కక్కడే ఆగిపోయాయని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు

**అపోహలకు గురికావద్దు**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్?పీజీ గ్యాస్ సరఫరాకు నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఎటువంటి అపోహలకు గురికావద్దని సూచించారు. రోజుకి 9,574 కిలో లీటర్ల పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్ మొత్తం 24,000 కిలో లీటర్ల పైగా పెట్రోల్, డీజిల్?లను బంకుల ద్వారా వాహనదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వినియోగదారులకు 2 లక్షల 22 వేలకు పైగా ఎల్?పీజీ గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరా, గ్యాస్ డెలివరీలపై పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1967 ను సంప్రదించాలని కోరారు.

# అడవి జిల్లాలో భానుడి భగభగలు

-మొదటిపేజీ తరువాయి

ఉన్నట్లు వ్షతావారణ శాఖ వెల్లడించింది.


మరోవైపు రాష్ట్రంలో పలుచోట్ల వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. ముందుగా సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాలు, మంగళవారం ఉత్తర, దక్షిణ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. 29న రాష్ట్రవ్యాప్తంగా, 30న మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాలు, వచ్చే నెల 1, 2 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది.

**వడదెబ్బతో ముగ్గురు మృతి**

రాష్ట్ర వ్యాప్తంగా వడదెబ్బకు గురై ఆదివారం ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని జగ్గారం గ్రామంలో మాదినేని ఆరోగ్య బాబు (57) పొలానికి వెళ్లారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అక్కడే స్పృహ తప్పి పడిపోయారు. సమయం గడుస్తున్నా ఇంటికి రాకపోడంతో కుటుంబసభ్యులు అతని కోసం గాలించగా పొలంలో కనిపించారు. అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన రావుల వేలాద్రి (60) వడదెబ్బతో అస్వస్థతకు లోనై మృతి చెందారు. నల్గొండ జిల్లా శాలిగౌరారం పంచాయతీ పరిధి పావురాలగూడెం గ్రామానకి చెందిన ఎన్?.యాదయ్య (56) వ్యవసాయపనులు చేస్తూ అస్వస్థతకు గురయ్యారు. చివరికి మృతి చెందారు.

**నిజామాబాద్ జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత**

తెలంగాణ వ్యాప్తంగా శనివారం పది జిల్లాల్లో 44.4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా నిజామాబాద్? జిల్లా మెండోరా మండలంలో 44.4 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. రెండో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు చేసిన ప్రాంతంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్? మండలం నిలిచింది. ఇక్కడ 44.3 డిగ్రీలు నమోదైంది. ఆది, సోమ, మంగళ వారాల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తేలికపాటి



నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే పగటిపూట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీల వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది.

**శనివారం ఆరుగురు మృతి**

ఎండల తీవ్రత కారణంగా శనివారం ఆరుగురు వడదెబ్బకు గురై మరణించారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం బారెపల్లికి చెందిన ట్రాక్టర్? డ్రైవర్ కొట్రంగి జయరాం (40) వడదెబ్బ కారణంగా చనిపోయారు. ఇదే తరహాలో ఆదిలాబాద్? జిల్లా తాటిగూడకు చెందిన రాంగోపాల్? గోడ్కె (65) ఆదిలాబాద్ పట్టణంలో వడదెబ్బకు గురయ్యారు. చివరికి ప్రాణాలు విడిచినట్లు పోలీసులు గుర్తించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్? మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సాదుల నరహరి (60) మోదుగు ఆకుల సేకరణకు (విస్తరి ఆకులకు) ఎండలో వెళ్లారు. ఇంటికి తిరిగొచ్చే సమయానికి అస్వస్థతను లోనయ్యారు. చివరకు ఆయన కూడా మృతి చెందారు. నల్గొండ జిల్లా నకిరేకల్ శివారులో బుధవారం రాత్రి జాతీయ రహదారిపై పడి ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలిని స్థానికులు గుర్తించారు. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కూడా వడదెబ్బకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం అర్వపల్లికి చెందిన మామిడి నరసింహ (45) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నారు. ఎండవేడికి ఆయన స్పృహ కోల్పోయిన అనంతరం మృతి చెందారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం రామ్?పురంలో నివాసం ఉంటున్న ఎం.డి.యూకూబీ (65) తీవ్ర విరేచనాల కారణంగా మరణించారు.

## అభివృద్ధి సరే... నిర్వహణ సంగతేంటీ

**హైదరాబాద్ :** నగరంలోని చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి బాధ్యతలను భుజాన వేసుకున్న 'హైడ్రా' కు ఇప్పుడు వాటి నిర్వహణ ఒక సవాలుగా మారింది. ఆక్రమణలను తొలగించి, చెరువులను సుందరీకరించిన తర్వాత వాటిని ఎవరు పర్యవేక్షించాలనే విషయంలో మున్సిపల్ అధికారులు, హైడ్రా మధ్య సందిగ్ధత నెలకొంది. అభివృద్ధి చేసిన తటాకాలను హైడ్రాకే వదిలేస్తూ జీహెచ్ఎంసీ చేతులు దులుపుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.చెరువుల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల బిల్లులు, రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసే భద్రతా సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులు ఇప్పుడు ప్రధాన సమస్యగా మారాయి. నిబంధనల ప్రకారం చెరువు కట్టలు, బఫర్ జోన్ల బాధ్యతను మున్సిపల్ అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చూడాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిధుల కేటాయింపు నేరుగా లేకపోవడం, హెచ్ఎండీఏ నిధులపైనే ఆధారపడాల్సి రావడంతో హైడ్రా వింత పరిస్థితిని ఎదుర్కొంటోంది.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 20 చెరువుల్లో ఆక్రమణలను తొలగించారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుల్ ఉద్దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు వంటి వాటిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు. అయితే, ఈ చెరువులను లోతుగా తవ్వి ట్యాంకుల్లా మార్చడం వల్ల వర్షాకాలంలో వరదను ఇవి ఎంతవరకు తట్టుకోగలవనే సందేహాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.నగరానికి ఆభరణాలుగా మారిన ఈ చెరువుల నిర్వహణ బాధ్యతను స్పష్టంగా ఎవరికి అప్పగించాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

## బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ లేదు

-మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యంగా ఉంటేనే తమకు మంచిదన్న రేవంత్? రెడ్డి, కేసీఆర్ మర మనిషో కాదో కుటుంబ సభ్యులకే తెలియాలన్నారు. వివక్ష లేని పాలన కాంగ్రెస్?దని, తమకు ప్రతిపక్షమే లేదన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే కవిత మాటలకు సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్? చేశారు. కవిత చెబుతున్నట్లు కేసీఆర్ ఎవరి బందీలో ఉన్నారని, కేసీఆర్ మర మనిషా మనసున్న మనిషా అని కవితకు జవాబివ్వాలన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోనని కేసీఆర్ దేవుడిపై ఒట్టు వేస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎక్స్‌పైరీ గడువు తీరిందని ఇక ఆ పార్టీతో పనిలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిన శవంతో సమానమని, కేసీఆర్ తన శత్రువు కాదని కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే అన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని కోరుకుంటోంది ఆయన కుటుంబమేనని అన్నారు.

**కేంద్రంపై ఒత్తిడి తెస్తాం**

పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని, కొన్ని సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని అన్నారు. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. సీబీఐ వివరాలు కోరితే అన్నీ ఇస్తామని, విచారణ మొదలైతే అన్నీ బయటకు వస్తాయని చెప్పారు. సీబీఐ విచారణ కోరితే కేంద్రం 48 గంటల్లో లోపల వేస్తామన్నారని సీఎం గుర్తు చేశారు. సీబీఐ విచారణ కోరినా కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడట్లేదు? అని, విచారణ కోసం కేంద్రం వద్దకు వెళ్తామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కోర్టు పరిధిలో ఉందని తోసిపుచ్చారు.

**అసెంబ్లీ భవనాలకు నష్టం కలగకూడదు**

పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతను పటిష్టం చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులపై అంతకుముందు శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్?లో సీఎం రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, మెంబర్స్?కు మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డెన్?లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతంలో సభ్యుల కోసం వాకింగ్ ట్రాక్, క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. వచ్చే సమావేశాల నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలన్నారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, మంత్రి అజారుద్దీన్ ప్రమాణస్వీకారం

ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మంత్రి అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**అది వాస్తవం కాదు**

ప్రమాణస్వీకారం అనంతర మంత్రి అజారుద్దీన్ మీడియా మాట్లాడారు. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ, రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన మంత్రిమండలి, పీసీసీకి, రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని వెల్లడించారు. రాజకీయాలు, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయన్న అజారుద్దీన్ అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదన్న ఆయన, సీఎం మొదట్నుంచి మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి తన మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇప్పుడు తాను కెప్టెన్‌ను కాదని, తమ కెప్టెన్ రేవంత్ రెడ్డి అని స్పష్టం చేశారు.

"రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తాను. రాజకీయాలు, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు" – అజారుద్దీన్, మంత్రి

**ఇచ్చిన మాటను నెరవేరుస్తాం**

పార్టీ ప్లీనరీలో చర్చించాక సమస్య పరిష్కారంపై కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని భావిస్తున్నామని, అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని ప్రజలకు హామీ ఇస్తున్నామని చెప్పారు. యూనివర్శిటీల పునరుద్ధరణ, బీసీ రిజర్వేషన్ల సాధన వంటి అనేక అంశాలపై పని చేస్తూనే ఉన్నామని, తమ పని తాము కొనసాగిస్తూనే ఉన్నామని, ఈ ఎమ్మెల్సీ పదవి అందుకు మరింత ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇంతకాలం పోరాడినట్లే ప్రజల తరఫున ఇకముందు పోరాడుతామన్నకోదండరాం రాజకీయాల్లో సరళమైన జీవనశైలి చాలా అవసరమని, అది కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమకు ఏ అవకాశం దొరికినా అది ప్రజల కోసం ఉపయోగపడాలని ప్రతిజ్ఞ చేశామని అన్నారు. జయశంకర్‌కు ఇచ్చిన మాటను నెరవేరుస్తామని హామీ ఇస్తున్నామని, అసలైన ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీ వేస్తామని ప్రకటించిందని, కార్యాచరణ వేగంగా జరగాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని వెల్లడించారు.

## తెలుగు రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలు చూపిస్తే రూ.కోటి ఇస్తా' : సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులతో మోసాలకు పాల్పడుతున్నారు. విదేశాల్లో ఉంటామని, తెలుగు రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాల్లో తిప్పాలని ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిని కోరుతున్నారు. కారు ఏర్పాటు చేసేందుకు అడ్వాన్సుగా డబ్బులు పంపుతామంటూ బ్యాంకు ఖాతా నెంబర్ ఇవ్వాలని కోరుతున్నారు. వారి మాటలు నమ్మి ఖాతా వివరాలు ఇస్తే మాటల్లో పెట్టి మాయ చేస్తున్నారు. అకౌంట్‌లో ఉన్నదంతా ఊడ్చుకెళ్తున్నారు. అసలేంటీ నేరాలు? నమ్మిన వారిని కేటుగాళ్లు ఎలా మోసం చేస్తున్నారు? హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తాను అమెరికాలో ఉంటానని, హైదరాబాద్ వచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు వివరించాడు. తొలిసారి వస్తున్నానని, పర్యాటక ప్రాంతాలను చూపేందుకు సహకరిస్తే రూ.50 లక్షలు ఇస్తానని ఆశ చూపాడు. ఈ సంభాషణ జరిగిన కొన్నిరోజుల తర్వాత తాను హైదరాబాద్ వచ్చానని, విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఆపి వేశారని తెలిపారు. జరిమానా చెల్లించేందుకు భారతీయ కరెన్సీ అవసరమంటూ రూ.2 లక్షలు యూపీఐ ఖాతాలో జమ చేయించుకున్నాడు. తర్వాత ఫోన్ కలవకపోవడంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణగూడకు చెందిన వ్యాపారికి టెలీగ్రామ్ యాప్‌లో మహిళ పరిచయమైంది. తాను యూకేలో ఉంటున్నానని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చూసేందుకు కారు ఏర్పాటు చేసేందుకు అడ్వాన్స్‌గా రూ.4 లక్షలు పంపుతానంటూ బ్యాంకు ఖాతా నెంబర్ తీసుకుంది. తాను పంపే యాప్‌ను డౌన్‌లోడ్ చూసుకోవాలని సూచించి, ఏపీకే ఫైల్ ద్వారా ఖాతా హ్యాక్ చేసి రూ.12 లక్షలు కొల్లగొట్టింది. విషయం తెలుసుకున్న వ్యాపారి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంతకు ముందు చెప్పుకున్న ఘటనల్లో సైబర్ కేటుగాళ్లు సామాజిక మాధ్యమాల్లో ఉత్సాహంగా ఉండే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. దేశ, విదేశాల్లో పర్యాటక ప్రాంతాలు, వంటలు వంటి వాటిపై రీల్స్ చేసే వారి వివరాలు ఆరా తీస్తున్నారు. ఫ్రెండ్ రిక్వెస్టు పంపుతూ సానుకూల స్పందన రాగానే ఛాటింగ్ మొదలుపె డుతున్నారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులమని పరిచయం చేసుకుంటున్నారు. పర్యాటక ప్రాంతాలు చూసేందుకు భారతదేశం వస్తున్నామంటూ నమ్మిస్తున్నారు. కొత్త ప్రదేశం కావడంతో నమ్మకమైన వారి సహాయం కావాలని అభ్యర్థిస్తున్నారు. పనులు మానుకుని సహాయం చేసేందుకు ముందుకు వస్తున్నందున భారీగా కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు.

# సంపాదకీయం

## మండే సూరీడు...

సూర్య భగవానుడు మండిపోతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు చల్లబడ్డ వాతావరణం.. ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి కాలం ముందే వచ్చేసింది. మార్చి నెల ఆరంభం నుంచే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. మరో 2 నెలలు కష్టమేనని చెప్పింది. ప్రస్తుతం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇక మే నెలలో నలభై ఐదు డిగ్రీలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.అనేక ప్రాంతాల్లో సాధరణం కంటే నాలుగైదు డిగ్రీలు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక వాడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళ కొంత చల్లగాలులు వీస్తున్నా ఉదయం పది గంటల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత ప్రారంభం అవుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశముందని వాతారణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మూల్యంచెల్లించుకోవాల్సి ఉంటుందని, ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశముందని, డీహైడ్రేషన్ కు లోను కాకుండా ప్రజలు తరచూ నీటిని తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు.తెలంగాణలోనూ హైదరాబాద్ నగరం ఉదయం పది గంటలకే వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు ఇప్పటికే అనేక వ్యాధులు బారిన పడి ఆసుపత్రులలో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లునొప్పుల వంటి వాటితో వస్తున్నారని, కొందరు జ్వరంతో స్పృహకోల్పోతున్నారని కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రతకు వ్యాపారాలు దెబ్బతినడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆహార విషయాల్లో కూడా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఢిల్లీ సహా ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ వీకెండ్‌లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దిల్లీలోని కొన్ని ఏరియాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఎండల తీవ్రత పెరగడంతో అధికారులు ఈ హెచ్చరికలు జారీ చేశారు.రాబోయే రెండు, మూడు రోజుల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా మధ్య, పశ్చిమ భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.వేసవికాలంలోని తీవ్రమైన ఎండలు ప్రాణాంతకంగా మారొచ్చు. తీవ్రమైన వేడి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం కావచ్చు.ఉత్తర, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు వారాంతంలో మరో 2-3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని శుక్రవారం వాతావరణ శాఖ తెలిపింది.ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి పాఠశాలలకు దిల్లీ విద్యా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.బహిరంగ ప్రదేశాల్లో క్లాసులు నిర్వహించకూడదని, ఎండలో జరిగే స్కూల్ అసెంబ్లీలను తగ్గించాలని లేదా ఇండోర్‌లో నిర్వహించాలని సూచించింది.పిల్లలు నీళ్లు తాగాలని గుర్తు చేసేందుకు ప్రతి 45-60 నిమిషాలకు ఒకసారి బెల్ మోగించాలని కూడా సూచించింది.2024లో భారత్ ఎదుర్కొన్న మూడింట ఒకవంతు వడగాల్పులకు వాతావరణ మార్పులే కారణమని ఆ ఏడాది మెడికల్ జర్నల్ లాన్సెట్ ప్రచురించిన ఒక రిపోర్టులో పేర్కొన్నారు.2024లో తీవ్రమైన ఎండల కారణంగా దాదాపు 247 బిలియన్ గంటల(24,700 కోట్ల గంటలు) పని సమయాన్ని కోల్పోయినట్లు, దానివల్ల 19,400 కోట్ల డాలర్ల ఆదాయం నష్టపోయినట్లు ఈ రిపోర్ట్ అంచనా వేసింది.ప్రధానంగా వ్యవసాయం, నిర్మాణరంగం వంటి సెక్టార్లు ప్రభావితమైనట్లు పేర్కొంది.ఎక్కువ సమయం పాటు తీవ్రమైన వేడికి గురవ్వడం వల్ల ఆరోగ్యంపై పలు దుష్ప్రభావాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు.ఉష్ణోగ్రతలు పెరిగితే డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె సంబంధిత ఒత్తిడి, మరణం సంభవించే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, ఆరుబయట పనిచేసే కార్మికుల్లో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.వేడి ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీరు తాగాలి. కాకరకాయ, దోసకాయ, సొరకాయ వంటి వాటర్ రిచ్ కూరగాయలు డైట్లో చేర్చుకోవాలి. ఇవి శరీరాన్ని కూల్‌గా ఉంచుతాయి. నీటి శాతం ఎక్కువగా ఉండే వాటర్‌మెలన్, మస్క్‌మెలన్ కూడా తీసుకోవచ్చు. ఇవి మీకు ఫ్రెష్ ఫీల్ ఇస్తాయి. బొప్పాయిని కూడా వేసవిలో తీసుకుంటే మంచిది. ఇది జీర్ణ సమస్యలను దూరం చేసి.. శరీరాన్ని లైట్‌గా ఉండేలా చేస్తుంది.మజ్జిగ శరీరానికి చల్లదనం ఇచ్చి డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది. నిమ్మరసం విటమిన్ అతో పాటు ఎలక్ట్రోలైట్స్ అందిస్తుంది. కొబ్బరి నీరు నేచురల్ ఎలక్ట్రోలైట్ డ్రింక్? అవుతుంది. వెంటనే ఎనర్జీ అందిస్తుంది. వేసవిలో ఎక్కువ మసాలాలు ఉండేవి కాకుండా లైట్ ఫుడ్స్ తీసుకుంటే మంచిది. అవి సులభంగా జీర్ణమవుతాయి.ఎండలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ బయటకు వెళ్లాల్సి వస్తే.. నీరు తీసుకెళ్లండి. ఎక్కువ సేపు ఎండలో ఉండొద్దు. లైట్, కాటన్ దుస్తులు వేసుకోండి. మధ్యాహ్నం 12 నుంచి 3 మధ్య బయటకు వెళ్లడం తగ్గించండి. అలాగే ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. ఇవి డీహైడ్రేషన్, అలసట వంటివి తగ్గిస్తాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా హెల్ప్ చేస్తాయి

# అగ్రరాజ్యాల ఆధిపత్యం ఇంకెన్నాళ్లు?



పశ్చిమాసియాలో రగులుతున్నది యుద్ధం మాత్రమే కాదు -- బీటలు వారుతున్న ప్రపంచ పరిపాలనా వ్యవస్థకు ప్రత్యక్ష సాక్ష్యం. గాజా నుంచి లెబనాన్ వరకు, ఇరాన్ నుంచి ఇజ్రాయెల్ వరకు, ఆసియా నుంచి అమెరికా వరకు విస్తరించిన ఈ పరిణామాలు ఒక కీలకమైన ప్రశ్నను సంధిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలు అంతర్గత కారణాల వల్ల నిర్వీర్యమయ్యాయా?, అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులకు బందీలైపోయాయా? ఈ రెండింటిలో ఏది నిజమైనా ప్రమాదకరమే. ప్రపంచదేశాల భద్రత, క్షేమం దృష్ట్యా తక్షణమే అరికట్టవలసిన పరిణామం ఇది. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థల పనితీరును ప్రస్తుత యుద్ధవాతావరణం నేపథ్యంలో పరిశీలించాలి. ఇటీవలి ఉద్రిక్తతలు ఒక విషవలయాన్ని సృష్టిస్తున్నాయి. అమెరికా ఇరాన్‌పై చేపట్టిన దాడులను 'ముందస్తు ఆత్మరక్షణ చర్యలు'గా సమర్థించుకుంటున్నది. సమాధానంగా ఇరాన్ క్షిపణి దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్‌తో పాటు గాజా, లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయెల్ తీవ్రమైన సైనికచర్యలకు పాల్పడుతున్నది. ఇలా చర్యప్రతిచర్యల పరంపర సుదీర్ఘకాలం కొనసాగుతూ ఆ ప్రాంతాన్ని మరింత అస్థిరత వైపు నెడుతున్నది. ఈ ఘర్షణల్లో పాల్గొనే ప్రతి దేశమూ ఐక్యరాజ్యసమితి ప్రకటన పత్రంలోని 51వ అనుచ్ఛేదం పరిధిని తనకు తానుగా విస్తరించుకుంటూ, తన చర్యలను సమర్థించుకుంటున్నది. ఆత్మరక్షణకు వెసులుబాటు కల్పించే ఈ సడలింపును, తన దాడికి చట్టబద్ధత చేకూర్చే సాధనంగా వాడుకుంటున్నది. ఈ చర్యలు, జెనీవా ఒప్పందాల ప్రాతిపదికగా రూపుదిద్దుకున్న అంతర్జాతీయ మానవతా చట్టంలోని కొన్ని ప్రాథమిక కట్టుబాట్లకు కూడా విరుద్ధంగా ఉన్నాయి. 'ప్రొపోర్షనాలిటీ', అంటే -- అవసరానికి మించిన బలప్రయోగం చేయకుండా ఉండటం; 'డిస్టింక్షన్', అంటే -- పౌరవసతులను యుద్ధపరిధి నుంచి మినహాయించడం వంటి మౌలిక సూత్రాల అమలుపై జటిలమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అయినప్పటికీ, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేర న్యాయస్థానం వంటి సంస్థలు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో చొరవ చూపడం లేదు. ఈ ఘర్షణలు ఆయా దేశాల్లో మానవతా సంక్షోభాన్ని సృష్టించడం మాత్రమే కాదు, వివాదంతో ఏమాత్రం సంబంధం లేని దేశాలపై కూడా ఒత్తిడి తెచ్చి, యుద్ధపరిధిని విస్తృతం చేసే అవాంఛనీయ పోకడలకు దారితీశాయి. హొర్ముజ్ జలసంధి వంటి కీలక రవాణామార్గాలను లక్ష్యంగా చేసుకోవడం -- ప్రపంచ దేశాల ఇంధన భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారింది. ఇందులో కూడా అంతర్జాతీయ సంస్థల ఆలసత్వం స్పష్టంగా కనబడుతున్నది. ఈ సందర్భంలో, ప్రపంచ శాంతి పరిరక్షణకు బాధ్యత వహించవలసిన వ్యవస్థల పాత్రపై సహజంగానే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

1945వ సంవత్సరంలో ఏర్పడిన ఐక్యరాజ్యసమితి ప్రకటన పత్రంలోని 24వ అనుచ్ఛేదం ప్రకారం అంతర్జాతీయ శాంతి-భద్రతలను కాపాడవలసిన ప్రాథమిక బాధ్యత సమితిలో భాగమైన భద్రతామండలిదే. రెండో ప్రపంచ యుద్ధంలో విజేతలుగా నిలిచి, ఆ కాలంలో శక్తికేంద్రాలుగా పేరొందిన అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, ఇంగ్లాండ్ దేశాలు భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వాన్ని పొందాయి. ఏదైనా తీర్మానాన్ని నిరాకరించే 'వీటో' హక్కు వీటికి ఉంటుంది. ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా ఆ తీర్మానం అమల్లోకి రాదు. ఒకరకంగా, ఈ ఐదింటిలో ఏ దేశమైనా, ప్రపంచంలోని ఏ దేశ భవితవ్యాన్ని అయినా శాసించగలదు.

మండలి నిష్క్రియాపరత్వానికి ఇదొక ప్రధాన కారణం. గాజా యుద్ధవిరమణ తీర్మానాలపై అమెరికా అడ్డంకులు, సిరియా అంశాల్లో రష్యాచైనా నిరాకరణ -- ఇవన్నీ యాదృచ్ఛిక ఘటనలు కాదు. వ్యవస్థలోని లోపాలను శక్తిమంతమైన దేశాలు తమకు అనుకూలంగా మలచుకుంటున్న ఘటనలు. శాశ్వత సభ్యదేశాల దృక్పథం, వ్యవహారశైలిలో సారూప్యత లోపించడం కూడా అస్థిరత, ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. ఉదాహరణకు, భద్రతామండలి తీర్మానం ద్వారా భారత్ అణుపరీక్షలను ఖండిస్తూ, వాటిని నిలిపివేయాలని కోరుతూ తక్షణమే కఠిన వైఖరి తీసుకున్నది. కానీ నేటి పశ్చిమాసియా సంక్షోభంలో ఆ దృఢత్వం, వేగిరపాటు కనిపించడం లేదు.

సభ్యుల్లో ఏకాభిప్రాయం ఉన్నప్పుడు భద్రతామండలి నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుంది. కానీ అందులోని సభ్యుల పరస్పర ప్రయోజనాలు ఢీకొన్నప్పుడు అది తన కార్యశీలతను కోల్పోతున్నది. తద్వారా, భద్రతామండలి క్రమంగా శాశ్వత సభ్యదేశాల స్వలాభాపేక్ష కోసం ప్రపంచదేశాల ప్రయోజనాలను పణంగా పెట్టే వ్యాపారసంస్థలా మారింది.

ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితికి నిర్ణయాలను తీసుకోగలిగే అధికారమే కానీ, వాటిని అమలు పరచగలిగే స్వతంత్ర వ్యవస్థ లేదు. ఆర్థిక స్వావలంబన కూడా లేదు. మనుగడ కోసం కొన్ని పెద్ద దేశాలపై అధికంగా ఆధారపడవలసి వస్తున్నది. ఇవన్నీ సమితి స్వతంత్రత, నిష్పాక్షికతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎనిమిది దశాబ్దాల క్రితం రూపుదిద్దుకున్న భద్రతామండలి నిర్మాణం, నేటి ప్రపంచ స్థితిగతులను ప్రతిబింబించడంలో విఫలమవుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం, ఆ దేశాల్లో అసంతృప్తిని పెంచుతున్నది. అందుకే భారత్ సహా అనేక దేశాలు ఎంతోకాలంగా భద్రతామండలి విస్తరణను కోరుతున్నాయి.

భారత్ తన జనాభా, ఆర్థికసామర్థ్యం, సైనికపాటవం, దక్షిణ సూడాన్‌లోని ఖచీవీ×ూూ, కాంగోలోని మీుచీఖూజూ వంటి శాంతి పరిరక్షణ దళాల్లో చేసిన గణనీయమైన సేవల ఆధారంగా మండలిలో శాశ్వత సభ్యత్వం కోరుతున్నది. భద్రతామండలిని ఒక నిష్పాక్షికమైన వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా -- బ్రిక్స్, ఏసియాన్, అరబ్ లీగ్, నాటో, సార్క్ వంటి పరిణితి చెందిన, ప్రాంతీయ-లక్ష్య సారూప్యత కలిగిన దేశాల సమూహాలకు అందులో ప్రాతినిధ్యం కల్పించడం ఒక ప్రత్యామ్నాయం.

అయితే, ఆ విధానం కూడా సరికొత్త సమీకరణాలు, అంతర్గత విభేదాలను సృష్టించే ప్రమాదం ఉన్నది. ఏ నమూనా ఏకపక్ష ధోరణులను నిజంగా తగ్గించగలదు? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలంటే, భద్రతామండలి సంస్కరణలపై స్పష్టమైన రాజకీయ సంకల్పం, విస్తృతస్థాయి మేధోమథనం, కాలబద్ధమైన నిర్దిష్ట చర్యలు తప్పనిసరి.

ఈ దిశగా, కేవలం సభ్యత్వ విస్తరణ సరిపోదు. మరింత క్రియాశీలకమైన పునర్వ్యవస్థీకరణ తక్షణావసరం. అందులో భాగంగా వీటో హక్కు వినియోగంపై శాశ్వతసభ్యదేశాలకు ప్రస్తుతం ఉన్న విస్తృతాధికారాలపై కత్తెర వేసే దిశగా కృషి జరగాలి. మానవతా సంక్షోభం ఏర్పడిన సందర్భాల్లో సభ్యులందరి అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకోవాలి, శాశ్వతసభ్యదేశాలకు పరిమితం కాకూడదు. సమితిని ఆర్థికంగా బలోపేతం చేసి, తన మనుగడ కోసం అగ్రరాజ్యాలపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి. ఈ సంస్కరణలు సరళంగా, హేతుబద్ధంగా కనబడినప్పటికీ, ఆచరణలో అనేక అడ్డంకులు ఎదురవుతాయి. అగ్రరాజ్యాలు సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న తమ ఆధిపత్యాన్ని స్వచ్ఛందంగా పరిమితం చేసుకునే నిర్మాణాత్మక వైఖరిని అవలంబిస్తేనే, సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి.

ఈ సందర్భంలో, భారతదేశం 1954వ సంవత్సరంలో ప్రతిపాదించిన పంచశీలలోని 'దేశాల సార్వభౌమత్వాన్ని గుర్తించడం, భౌగోళిక సమగ్రతకు గౌరవం, ఇతర దేశాలపై దాడి చేయకపోవడం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం, సమానత్వం-పరస్పర లాభం, శాంతియుత సహజీవనం' ఐదు సూత్రాలను పునరుద్ధరించ వలసిన అవసరం ఉన్నది. ఈ సూత్రాలు బాండుంగ్ సదస్సు వంటి ప్రతిష్ఠాత్మక వేదికల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విస్తృత అంగీకారాన్ని పొంది; భారతదేశానికి విశేషమైన గుర్తింపును తెచ్చిన అలీన విదేశాంగ విధానానికి పునాదిగా నిలిచాయి.

భారత్, చైనాతోపాటు అభివృద్ధి చెందుతున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు సభ్యత్వ విస్తరణతోపాటు, ప్రతిపాదిత సంస్కరణల విషయంలో ఏకాభిప్రాయం సాధించే దిశగా మరింత నిర్మాణాత్మకంగా కృషి చేయాలి. మొత్తానికి, పశ్చిమాసియా సంక్షోభం ప్రాంతీయ యుద్ధ స్థాయి నుంచి ప్రపంచ పరిపాలనా వ్యవస్థ జవాబుదారీతనాన్ని పరీక్షించే గీటురాయిగా మారింది. చట్టాలు ఉన్నా, అవి అమలు కాకపోతే వ్యవస్థ గాడి తప్పుతుంది. సంస్థలు ఉన్నా, వాటికి జవసత్వాలు లేకపోతే నిష్ప్రయోజనం అవుతాయి. ప్రపంచం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నది -- అంతర్జాతీయ వ్యవస్థను పునర్నిర్మించాలా? లేకపోతే అది క్షీణించడాన్ని చూస్తూ ప్రేక్షకపాత్ర వహించాలా?

# ఉద్యమ పథంలో ఉద్యోగులు, పెన్షనర్లు

ప్రభుత్వ ఉద్యోగులు..కర్తవ్య నిర్వహణ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తూ తమ విలువైన జీవితాలను త్యాగం చేస్తుంటారు. చాలామంది సాయంత్రం ఎన్నింటికి ఇంటికి చేరుకుంటారో తెలియదు. కొందరికి సెలవులు, ఆదివారాలు కూడా కరువే. ఇంటికొచ్చినా ఆఫీసు ఫోన్లతో తీరిక లేకుండా తమ కుటుంబాలను చూసుకోలేని అశక్తులు కొందరు ఉంటారు. మొబైల్, లాప్టాప్‌లో తమ అధికారులు, ఉన్నతాధికారుల నుంచి వచ్చే మెసేజ్‌లు, మెయిల్స్ అంటూ ఇంటి వద్ద కూడా ఆఫీసు పని చేసుకునే అభాగ్యులు మరికొందరు. పని ఒత్తిడితో తరచూ కొందరు అనారోగ్యం పాలవుతుంటారు. తమ సొంత బిడ్డల చదువు, తల్లిదండ్రుల ఆరోగ్యం పట్టించుకునే తీరిక కొందరికి ఉండదు. కానీ వారి సంక్షేమం చూసే కనీస బాధ్యత నుంచి ప్రభుత్వం దూరమవుతున్నది. వారు ప్రభుత్వంలో భాగమనే కఠోర సత్యాన్ని గుర్తించలేకపోవటం దురదృష్టకరం. వారికి జీతాలు ఎక్కువ అనే భావన ద్వారా తమ నివేదికలు, ఉపన్యాసాలు, ఇంటర్వ్యూల్లో ప్రజలకు తప్పుడు సంకేతాలను పంపిస్తూ వారిపై ప్రస్తుత ప్రభుత్వం ఒక వ్యతిరేక భావాన్ని కలుగజేస్తున్నది. పెన్షనర్లు..మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ సేవలు అందించి, పదవీ విరమణ నాడు తమకు రావాల్సిన బకాయిలను ఆశిస్తారు. తాము దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ డబ్బులు, తమకు లేదా తమ కుటుంబ సభ్యుల అనారోగ్యానికి పెట్టిన ఖర్చుకు సంబంధించిన డబ్బు రాక హతాశులవుతుంటారు. ఇక గ్రాట్యుటీ, కమ్యుటేషన్ లాంటివి ఎప్పుడు విడుదలవుతాయో తెలియని అయోమయ స్థితి నెలకొంటున్నది. కేవలం వారి జీతంలో సగానికి తక్కువ వచ్చే పెన్షన్ డబ్బులతో జీవితాన్ని నడిపిస్తూ తమ కూతురు పెండ్లి లేదా సొంత ఇంటి కలను సాకారం చేసుకుందామని అనుకుంటే అది ఎండమావిలా మారటం మరింత బాధపెడుతున్నది. వయసు మీరుతుండటం, అనారోగ్యం ఆవహిస్తుండటంతో నిస్సహాయ స్థితిలో రోజులు గడిపే పెన్షనర్లు కొంతమంది ఆ పరిస్థితిని భరించలేక బలవన్మరణాలకు పాల్పడటం శోచనీయం.



ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులను బాగా చూసుకుంటామని, వారు తమ కండ్లలాంటి వారంటూ మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తర్వాత ఆ సంగతే మరచిపోయింది. వారితో భేటీ కావటానికి కూడా పెద్దగా ఇష్టపడడం లేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులు, పెన్షనర్లకు వెంటనే పెండింగ్ డీఏలు ప్రకటిస్తామని, పీఆర్‌సీ అమలు చేస్తామని, ఆరోగ్య కార్డులు ఇస్తామని, ఇతర డిమాండ్లు కూడా పరిశీలిస్తామని నమ్మబలికింది. తీరా గద్దెనెక్కిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కాస్త సమయం కావాలని కోరింది. సహజంగానే ఉద్యోగులు నమ్మి రెండున్నరేండ్ల సమయం ఇచ్చినా సర్కార్‌కు కనీసం చీమ కుట్టినట్లుగా కూడా లేదు. కాంగ్రెస్ గద్దెనెక్కిన ఈ రెండున్నరేండ్లలో కేవలం రెండు డీఏలు అతి కష్టంగా విడుదల చేసింది. కానీ ఇంకా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఉద్యోగులకు బాధతోపాటు ఆర్థిక భారం కలిగిస్తున్నది. అవసరమైతే సంక్షేమ కార్యక్రమాలు నిలిపివేసైనా ఉద్యోగులకు డీఏలు చెల్లించాలని న్యాయస్థానాలు మొత్తుకున్నాయి. 2023 జూన్ నుంచి ఉద్యోగులకు అమలు కావలసిన పీఆర్‌సీ గురించి ప్రభుత్వం కనీసం చర్చించడానికి కూడా సిద్ధంగా లేదు. వేతన సవరణ సంఘం కాలాన్ని ప్రతి ఆరు నెలలకు ఒకసారి పొడిగిస్తూ వస్తున్నది. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల విషయంలోనూ అంతే సాచివేత ధోరణి ప్రదర్శించి, చివరకు ఎవరికీ సాధ్యంకాని విధానాన్ని అమలు చేయబోతున్నామని ఆర్భాటంగా సర్కార్ ప్రకటించింది. అంటే ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల సానుభూతి కానీ సానుకూల దృక్పథం కానీ లేవనేది రుజువవుతున్నది.

మోసపోయామని ఆలస్యంగా గ్రహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు జేఏసీగా ఏర్పడి తప్పని పరిస్థితుల్లో ఆందోళనలకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగానే ఈనెల 17వ తేదీన నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు తమ తమ కార్యాలయాల్లో సమావేశాలు జరిపారు. మే 5న మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలు వంటి ఆందోళన కార్యక్రమాలతో జేఏసీ ఒక అడుగు ముందుకేసి ప్రభుత్వంపై శంఖారావం పూరించడానికి సిద్ధమైంది.


సరిగ్గా 24 నెలలు క్రితం పదవీ విరమణ పొందిన వారికి నేటికీ బకాయిలు చెల్లించకపోవడం అలసత్వమా? లేదా అసమర్థతా? ఉద్యోగ వర్గాల పట్ల నిర్లిప్తత, నిర్లక్ష్యభావమా? అనే అనుకోవాల్సి వస్తున్నది. అప్పులు తేకుండా నెల గడవడం లేదు. కానీ ప్రభుత్వం చేసే వృధా ఖర్చుల కారణంగా అనేక సంక్షేమ పథకాలు అటకెక్కుతున్నాయి. ప్రభుత్వం సంక్షేమం నుంచి సంక్షోభం దిశగా శరవేగంగా దిగజారుతున్నదని స్పష్టమవుతున్నది. ఉన్న నిధులను సక్రమంగా వినియోగించడంలో సర్కార్ విఫలమవుతున్నది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను 30 నెలలుగా పరిష్కరించకుండా వారిని మాటలతో హామీలతో మభ్యపెట్టడం ఇంకా ఎంతోకాలం సాగదు. వారి కుటుంబాలు అరిగోస, ఆక్రోశంతో ఉన్నాయి. వారికి సంబంధించిన 64 డిమాండ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లు ఉన్నాయి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, కొత్త విధానాన్ని రద్దు చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్లలో ఒకటి. జూన్ రెండవ తేదీ లోపు పీఆర్‌సీ ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ప్రధాన డిమాండ్. ఇందుకు అనుగుణంగా మే 5వ తేదీన సామూహిక నిరాహార దీక్షలు, 14న సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నది. ఇకనైనా ప్రభుత్వం కండ్లు తెరిచి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. ఇంకా జాప్యం చేస్తే భవిష్యత్తులో వారి నిర్ణయాన్ని తమ ఓట్ల ద్వారా తెలుపవలసి ఉంటుందని చెప్పకతప్పదు.



# పనస పండు వీరికి యమడేంజర్

పనస పండు.. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన ఫలం. రుచిలోనే కాదు, శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందించడంలోనూ పనసకు సాటిలేదు. ముఖ్యంగా పురుషులకు ఇది ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రీసెర్చ్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ టెక్నాలజీ అధ్యయనం ప్రకారం.. ఈ పండు అందరికీ సెట అవ్వదు.. కొన్ని సమస్యలు ఉన్నవారు వీటిని తినకూడదు. వేసవి వచ్చిందంటే మామిడి పండ్లతో పాటు మార్కెట్లో నోరూరించే మరో పండు పనస. ఆ సువాసన వింటేనే చాలు, తినని వారు కూడా ఒక్క ముక్కైనా రుచి చూడాలనుకుంటారు. రుచిలో తీయగా, గుజ్జు ఎంతో మృదువుగా ఉండే పనస పండులో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇది అందరికీ మేలు చేయదని, కొందరికి ఈ పండు విషంతో సమానమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ పనస పండును ఎవరు తినాలి..? ఎవరు దూరంగా ఉండాలి..? అనే విషయాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. పనస పండులో నీటి శాతం, పీచు పదార్థం అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీనిలోని విటమిన్లు, ఖనిజాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.ఇందులోని విటమిన్-సి ఇమ్యూనిటీని పెంచి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. పనస పండు పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని, అంగస్తంభన సమస్యలను తగ్గిస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు రాకుండా కాపాడుతాయి, జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడతాయి. రక్తహీనత సమస్యతో బాధపడేవారికి పనస ఒక మంచి ఔషధంలా పనిచేస్తుంది. రుచిగా ఉంది కదా అని అతిగా తింటే కొన్ని ఆరోగ్య సమస్యలు తప్పవని రీసెర్చ్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ టెక్నాలజీ వెల్లడించింది. మధుమేహ బాధితులు: పనస పండులో సహజ చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. అందుకే షుగర్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి. జీర్ణ సమస్యలు ఉన్నవారు: పనస పండు తిన్న తర్వాత కొందరిలో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు దీనిని పరిమితంగా తీసుకోవాలి. గర్భిణీ స్త్రీలు: గర్భధారణ సమయంలో షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉన్నందున గర్భిణీలు పనస పండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకే తీసుకోవడం ఉత్తమం. రక్తం గడ్డకట్టే సమస్యలు: బ్లడ్ కోగ్యులేషన్ సమస్య ఉన్నవారు పనస పండు తినకూడదు, ఇది ఆ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. పనస పండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, అది ఒక ఔషధం కూడా. అయితే ఏదైనా అతిగా తింటే నష్టమే. ఆరోగ్యంగా ఉన్నవారు కూడా మితంగా తీసుకుంటేనే పనస ప్రయోజనాలను పూర్తిగా పొందగలరు. మీకు ఏవైనా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే నిపుణులను సంప్రదించిన తర్వాతే ఈ పండును మీ డైట్‌లో చేర్చుకోండి.

# బొప్పాయి గింజలు.. పోషకాల గని



ప్రకృతి మనకు ప్రసాదించిన పండ్లలో బొప్పాయికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే పండు ఏదైనా ఉందంటే అది బొప్పాయే. అయితే మనం పండును తిని, లోపల ఉండే నల్లటి గింజలను మాత్రం చెత్తబుట్టలో పారేస్తుంటాం. కానీ ఆ గింజలే సూపర్ ఫుడ్ అని మీకు తెలుసా? ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు ఆరోగ్య పరిశోధనల ప్రకారం, బొప్పాయి గింజలు అనేక మొండివ్యాధులను నయం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. జీర్ణక్రియ: బొప్పాయి గింజల్లో పాపైన్, ఖైమోపాపైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి మనం తినే ఆహారంలోని ప్రోటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అంతేకాకుండా పేగుల్లో ఉండే హానికరమైన నులిపురుగులు, పరాన్నజీవులను చంపే గుణం వీటికి ఉంది. ఇందులో పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఫలితాలను ఇస్తుంది. కాలేయానికి సంజీవని: నేటి కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది ఫ్యాటీ లివర్ లేదా లివర్ సిర్రోసిస్ బారిన పడుతున్నారు. బొప్పాయి గింజలు కాలేయాన్ని శుద్ధి చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ప్రతిరోజూ కొద్దిగా బొప్పాయి గింజల పొడిని నిమ్మరసంతో కలిపి తీసుకుంటే, కాలేయంలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిపోయి, దాని పనితీరు మెరుగుపడుతుంది. క్యాన్సర్: బొప్పాయి గింజల్లో ఉండే ఎసిటోజెనిన్ అనే సమ్మేళనం క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా అడ్డుకుంటుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ల నివారణలో ఇవి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. శరీరంలోని వ్యర్థాలను వడపోసే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే బొప్పాయి గింజలు మేలు చేస్తాయి. కిడ్నీ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి రక్షించడమే కాకుండా ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి మూత్రపిండాల కణజాలాన్ని దృఢంగా మారుస్తాయి. అదేవిధంగా కీళ్ల నొప్పులు, వాపులు, ఆర్థరైటిస్ సమస్యలతో బాధపడేవారికి బొప్పాయి గింజలు ఒక సహజ ఔషధం. వీటిలో ఉండే విటమిన్ సి, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ శరీరంలో కలిగే మంటను, నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ఎలా వాడాలి: బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా, మిరియాల వంటి ఘాటును కలిగి ఉంటాయి. ఈ గింజలను ఎండబెట్టి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడిని సలాడ్లు, స్మూతీలు లేదా సూప్‌లలో అర టీస్పూన్ చొప్పున కలుపుకోవచ్చు. నల్ల మిరియాలకు బదులుగా ఈ ఎండిన గింజలను గ్రైండ్ చేసి వంటల్లో వాడుకోవచ్చు. గింజల చేదును తగ్గించడానికి కొద్దిగా తేనెతో కలిపి నేరుగా కూడా తీసుకోవచ్చు.

# ఒక కిలోమీటర్ వాకింగ్ చేస్తే బాడీలో ఎంత కొవ్వు కరుగుతుందా?

మీరు బరువు తగ్గాలనుకుంటున్నారా? అయితే గంటల తరబడి శ్రమ పడనక్కర్లేదు. రోజుకు కేవలం ఒక కిలోమీటరు నడకతో మీ ఆరోగ్యాన్ని ఎలా మార్చుకోవచ్చో మీకు తెలుసా? ఒక కిలోమీటరు నడకలో ఎన్ని కేలరీలు కరుగుతాయి? ఇది నిజంగా బరువు తగ్గడానికి సహాయపడుతుందా? నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్ కోసం జిమ్‌లు, కఠినమైన డైట్‌లు అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ ఎటువంటి ఖర్చు లేకుండా అన్ని వయసుల వారు పాటించగలిగే అత్యంత సులభమైన వ్యాయామం నడక. రోజుకు కనీసం ఒక కిలోమీటరు నడవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.సాధారణంగా ఒక కిలోమీటరు నడవడం వల్ల 60 నుండి 100 కేలరీల వరకు శక్తి ఖర్చవుతుంది. అయితే ఈ కేలరీల ఖర్చు అనేది వ్యక్తి యొక్క బరువు, ఎత్తు మరియు నడిచే వేగంపై ఆధారపడి ఉంటుంది. మీరు ఎంత వేగంగా నడిస్తే, అంత ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి. బరువు తగ్గాలనుకునే వారు సాధారణ నడక కంటే వేగంగా నడవటం మంచిది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ నడవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. నడక వల్ల శరీరంలో ఒత్తిడిని తగ్గించే హార్మోన్లు విడుదలవుతాయి. ఇది మానసిక స్థితిని మెరుగుపరిచి, డిప్రెషన్ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణక్రియ – బరువు: నడక వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా ఇది మెదడుకు విశ్రాంతినిచ్చి రాత్రిపూట గాఢ నిద్ర పట్టేలా చేస్తుంది. కేవలం నడకతోనే బరువు తగ్గడం సాధ్యం కానప్పటికీ, సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ నడకను కలిపితే శరీర బరువులో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. ఒక కిలోమీటరు నడక అనేది వినడానికి చిన్నదిగా అనిపించినప్పటికీ, దీనిని ఒక అలవాటుగా మార్చుకుంటే నెల రోజుల్లో వేల సంఖ్యలో కేలరీలను ఖర్చు చేయవచ్చు. ఉదయం నిద్రలేవగానే నోటి రుచి మారడం వంటి సమస్యలు ఎదుర్కొనే వారు కూడా వారి దినచర్యలో నడకను చేర్చుకోవడం ద్వారా శరీర జీవక్రియలను క్రమబద్ధీకరించుకోవచ్చు. పెద్దగా శ్రమ పడకుండా ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి వాకింగ్ ఒక సంజీవని లాంటిది.



# మసాలా దినుసులు.. బంగారం ధర కంటే ఎక్కువట..!

దాదాపు ప్రతి ఇంటి వంట గదిలో మసాలా దినుసులు ఉంటాయి. ఇవి వంటల రుచిని పెంచడానికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయి. అయితే ఇందులో కొన్ని మసాలా దినుసులకు బంగారంతో సమానమైన ప్రాముఖ్యత ఉంది. నేటికీ మార్కెట్లో కొన్ని మసాలాల ధరలు సామాన్యుడి ఊహకు అందని విధంగా ఉన్నాయి. ఈ ధర కేవలం మార్కెటింగ్ కారణంగానే కాకుండా వాటి ఉత్పత్తి, పరిమిత లభ్యత కారణంగా కూడా ఏర్పడుతుంది. దాదాపు ప్రతి ఇంటి వంట గదిలో మసాలా దినుసులు ఉంటాయి. ఇవి వంటల రుచిని పెంచడానికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయి. అయితే ఇందులో కొన్ని మసాలా దినుసులకు బంగారంతో సమానమైన ప్రాముఖ్యత ఉంది. నేటికీ మార్కెట్లో కొన్ని మసాలాల ధరలు సామాన్యుడి ఊహకు అందని విధంగా ఉన్నాయి. ఈ ధర కేవలం మార్కెటింగ్ కారణంగానే కాకుండా వాటి ఉత్పత్తి, పరిమిత లభ్యత కారణంగా కూడా ఏర్పడుతుంది. కుంకుమపువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసుగా పరిగణించబడుతుంది. కుంకుమపువ్వును క్రోకస్ అనే పువ్వు సున్నితమైన భాగాల నుంచి తయారు చేస్తారు. ఒక కిలో కుంకుమపువ్వును పొందడానికి లక్షలాది పువ్వులు అవసరం. ఈ ప్రక్రియ మొత్తం చేతితోనే చేస్తారు. అందుకే ఒక కిలో కుంకుమపువ్వు ధర సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. ఇంగువను ఒక ప్రత్యేకమైన మొక్క జిగురు నుంచి తయారు చేస్తారు. దీనిని సాగు చేసి, జిగురును తీసే ప్రక్రియ చాలా కష్టమైనది, సమయం కూడా ఎక్కువగా తీసుకుంటుంది. మన దేశంలో స్వచ్ఛత రకాన్ని బట్టి ఇంగువ ధర కిలోకు రూ. 10,000 నుండి రూ. 35,000 వరకు ఉంటుంది. ప్రత్యేకమైన సువాసనకు ప్రసిద్ధి చెందిన యాలకులను మసాలా దినుసుల రాణి అని పిలుస్తారు. యాలకుల సాగుకు నిర్దిష్ట వాతావరణ పరిస్థితులు అవసరం. దీనిని పూర్తిగా చేతితోనే కోయాలి. ప్రస్తుతం, యాలకుల మార్కెట్ ధర కిలోకు సుమారు రూ. 2,850గా ఉంది. లవంగాలు వాస్తవానికి ఎండిన పూల మొగ్గలు. వాటిని సరైన సమయంలో కోయడం వల్ల వీటిని తయారు చేస్తారు. ప్రధానంగా ఇండోనేషియాలో ఉత్పత్తి అయ్యే లవంగాల ధర ప్రస్తుతం కిలోకు రూ. 1,300 నుంచి రూ. 2,299 మధ్య ఉంది. చెట్టు బెరడు నుంచి తయారయ్యే దాల్చినచెక్క అత్యంత స్వచ్ఛమైనదిగా, ఖరీదైనదిగా పరిగణించబడుతుంది. ఇది శ్రీలంకలో ఉత్పత్తి అవుతుంది. నాణ్యతను బట్టి దాల్చినచెక్క ధర కిలోకు రూ. 600 నుండి రూ. 1500 వరకు



# ఉతకకుండా కొత్త డ్రెస్‌లు వేసుకుంటున్నారా?



చాలా మంది కొత్త డ్రెస్ లు వేసుకోవడానికి ఇష్టపడతారు. అయితే, అసలు వాష్ చేయకుండా వేసుకోవడం మంచిదేనా? అయితే, కొన్ని సందర్భాల్లో అయితే ఇది ప్రమాదకరంగా మారనుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. మనలో చాలా మంది కొత్త డ్రెస్ లు వేసుకోవడానికి ఇష్టపడతారు. అయితే, అసలు ఇలా వేసుకోవడం మంచిదేనా? కొన్ని సార్లు అయితే ఏం కాదు కానీ, మరి కొన్ని సందర్భాల్లో అయితే ఇది ప్రమాదకరంగా మారనుంది. అంతేకాదు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త డ్రెస్‌లు ఉతకకుండా వేసుకోవడం వలన చర్మ సమస్యలు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, షాపింగ్ మాల్స్ లో అందరూ చేసే పని ఇది. బట్టల షాప్ లోకి వెళ్ళగానే ట్రైల్స్ వేస్తారు. ఎందుకంటే, వీటి తయారీకి అనేక రంగులు వాడుతారు. ఇంకా వీటిలో ఫార్మాల్డిహైడ్ వంటి రసాయనాలు కూడా వాడతారు. ఇవి అంత మంచివి కావు. కాబట్టి, వీటిని వేసుకునేటప్పుడు ఒకటికి రెండు సార్లు అలోచించి వేసుకోండి. ఇంకా చాలా మంది షోరూమ్‌లలో ట్రయల్ వేస్తారు. దీని వలన చర్మ వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా, పిల్లల చర్మం సెన్సిటివ్ కాబట్టి, వారికి ఇలాంటి దుస్తులను ఉతికిన తర్వాతే వేయండి లేదంటే అనారోగ్య మస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.



# వచ్చే ఏడాది దర్శకత్వం!

'గాయపడ్డ సింహం' చిత్రంలో తాను అతిథి పాత్రలో కనిపిస్తానని, హీరో తరుణ్‌భాస్కర్‌తో ఓ రొమాంటిక్ ట్రాక్ కూడా ఉంటుందని, వ్లాగర్‌గా తన పాత్ర కావాల్సినంత వినోదాన్ని పంచుతుందని చెప్పింది ఫరియా అబ్దుల్లా. తరుణ్‌భాస్కర్ కథానాయకుడిగా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన 'గాయపడ్డ సింహం' చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం ఫరియా అబ్దుల్లా విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. తన పాత్ర పేరు శాలిని అని, ఆద్యంతం వినోదప్రధానంగా సాగుతుందని తెలిపింది. తరుణ్‌భాస్కర్ కామెడీ టైమింగ్ అద్భుతమని, ఆయన చిన్న ఎక్స్‌ప్రెషన్ కూడా నవ్వు తెప్పిస్తుందని, తమ మధ్య వచ్చే సన్నివేశాలు హిలేరియస్‌గా ఉంటాయని ఫరియా అబ్దులా పేర్కొన్నది. దర్శకత్వం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ప్రస్తుతం కొన్ని కథల్ని సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నానని, వచ్చే ఏడాది తప్పకుండా సినిమా డైరెక్షన్ చేస్తానని చెప్పింది. తదుపరి సినిమా వివరాలు తెలియజేస్తూ 'ప్రస్తుతం 'భగవంతుడు' 'సిగ్మా' చిత్రాల్లో నటిస్తున్నా. మరో రెండు సినిమాలు త్వరలో ప్రారంభమవుతాయి. సత్యదేవ్‌తో ఓ సినిమా ఉంటుంది' అని చెప్పింది.



# కన్నీళ్లను ఆపుకోలేకపోయా!

దక్షిణాదిలో తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న సాయిపల్లవి 'ఏక్ దిన్' చిత్రంతో హిందీ చిత్రసీమలోకి అరంగేట్రం చేస్తున్నది. అమీర్‌ఖాన్ కుమారుడు జునైద్‌ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సునీల్ పాండే దర్శకుడు. అమీర్‌ఖాన్ నిర్మాణ భాగస్వామి. మే 1న సినిమా విడుదల కానున్నది. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సాయిపల్లవి భావోద్వేగభరితంగా మాట్లాడింది. తాను ఇప్పటివరకు ఏం సాధించానో తెలియదని, అయితే వివిధ భాషల్లో గొప్ప ప్రతిభావంతులతో కలిసి పనిచేశాననే సంతృప్తి మాత్రం మిగిలిందని చెప్పింది. హిందీ ప్రేక్షకులు తనను ఎలా స్వీకరిస్తారోనని కాస్త ఆందోళనగా ఉందని సాయిపల్లవి తెలిపింది. 'ఈ సినిమా చూసి కన్నీళ్లను ఆపుకోలేకపోయా. చుట్టూ లైట్స్ లేకుండా ఉంటే ఏడుపు ఆగేది కాదు. అమీర్‌ఖాన్‌లా అందరి ముందు ఎమోషనల్ అవ్వాలంటే చాలా ధైర్యం కావాలి. నేను మాత్రం భావోద్వేగాలను చాలా వరకు కంట్రోల్ చేసుకున్నా. 'ఏక్ దిన్' హృద్యమైన ప్రేమకథ. బాలీవుడ్‌లో నాకు శుభారంభాన్నిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పింది. ఈ సినిమా 'ఒక రోజు' టైటిల్‌తో తెలుగులో విడుదలకానుంది.

# లాయర్ పాత్రలో



కాజల్ అగర్వాల్ లాయర్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది ఇండియా స్టోరీ'. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాగర్ బి షిండే నిర్మిస్తున్నారు. జూలై 24న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. పంటసాగులో పురుగు మందుల వినియోగం, పెస్టిసైడ్స్ కంపెనీల కుంభకోణాల నేపథ్యంలో రైతు సమస్యల్ని, సమకాలీన అంశాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వ్యవస్థలోని అవినీతిపై పోరాడే న్యాయవాదిగా కాజల్ అగర్వాల్ కనిపించనుంది. రసాయనాల దుర్వినియోగం కేవలం పర్యావరణ సమస్య కాదని, అది మానవ సంక్షోభానికి దారితీస్తుందని, ఈ సినిమా ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించబోతున్నామని నిర్మాత సాగర్ బి షిండే తెలిపారు. నిజాయితీగా చేసిన ప్రయత్నమిదని, సందేశంతో పాటు వినోదాత్మక అంశాలుంటాయని దర్శకుడు చేతన్ డీకే చెప్పారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా శ్రేయస్ తల్పడే నటిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నది.

# పవర్‌ఫుల్ పోలీస్



హీరోయిన్ సంయుక్త ప్రధాన పాత్రలో కోల్ సిండికేట్ నేపథ్యం, నిజ జీవిత ఘటనల స్ఫూర్తితో రూపుదిద్దుకున్న యాక్షన్ సినిమా 'ది బ్లాక్ గోల్డ్'. కేఎమ్‌సీ యోగేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేశ్, మురళీ శర్మ, నాజర్, మనీష్ వాధ్వా, రాంకీ, రవీంద్ర విజయ్ ఇతర పాత్రల్లో నటించారు. మాగంటి పిక్చర్స్ సహకారంతో హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. "తెలంగాణ-- మహారాష్ట్ర సరిహద్దులోని బొగ్గు గనుల నేపథ్యంతో సాగే కథే 'ది బ్లాక్ గోల్డ్'. సంయుక్త పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్ నగర్, ఆదిలాబాద్ లొకేషన్స్‌తో పాటుగా, హైదరాబాద్‌లో వేసిన సెట్స్‌లో ఈ సినిమా చిత్రీకరించాం. ఈ మూవీ కోసం పదికిపైగా భారీ సెట్స్ వేశాం. 60కిపైగా వర్కింగ్ డేస్‌లో చిత్రీకరణను పూర్తి చేశాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం" అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: సింధు మాగంటి, సంగీతం: సామ్ సీఎస్.

# ఈ వేసవిలో చలివేంద్రంలాంటి సినిమా

'గోదావరిలో పడితే బయటకు వచ్చే ఛాన్స్ ఉంటుంది. కానీ మా 'గోదారి గట్టుపైన' ప్రేమలో పడితే బయటకు రావడం కష్టం. అంతగా మీరు సినిమాను ఇష్టపడతారు. ఈ వేసవిలో ఈ సినిమా కూల్ వైబ్స్ ఇస్తుంది' అన్నారు చిత్ర కథానాయకుడు సుమంత్ ప్రభాస్. ఆయన హీరోగా సుభాష్‌చంద్ర దర్శకత్వంలో రూపొందిన 'గోదారి గట్టుపైన' చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకురానుంది. నిధి ప్రదీప్ కథానాయిక. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. రాజు అనే ఆటోడ్రైవర్, అతని ఆటోలో రోజూ ప్రయాణించే ఓ కాలేజీ అమ్మాయి మాయ మధ్య ప్రేమకథ, వారి ప్రయాణంలో ఎదురైన సవాళ్ల నేపథ్యంలో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ..తాను పుట్టి పెరిగింది తెలంగాణలో అయినా ఈ సినిమా కోసం కోనసీమ యాసను నేర్చుకున్నానని చెప్పారు. సహజత్వం కలబోసిన అందమైన గ్రామీణ ప్రేమకథగా మెప్పిస్తుందని అన్నారు. ఈ వేసవిలో చలివేంద్రంలాంటి సినిమా ఇదని, రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశామని దర్శకుడు సుభాష్‌చంద్ర తెలిపారు. సినిమాలోని చివరి 40 నిమిషాలు భావోద్వేగభరితంగా సాగుతాయని నిర్మాత అభినవ్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందమంతా పాల్గొన్నారు.



# బిజినెస్

## అల్ట్రాటెక్ లాభం 3 వేల కోట్లు




**న్యూఢిల్లీ :** అల్ట్రాటెక్ సిమెంట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,000 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,474.79 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.25,799 కోట్లకు ఎగబాకింది.

## రోల్స్-రాయిస్‌తో సిగ్మా జట్టు




**హైదరాబాద్ :** రాష్ట్రానికి చెందిన సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్.. రోల్స్-రాయిస్‌తో జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా సిగ్మా ఏరోస్పేస్ సిస్టమ్‌కు సంబంధించిన కీలక విడిభాగాలు తయారు చేయడంతోపాటు సరఫరా చేయాల్సి వుంటుందని పేర్కొంది.ఁశీబతీఱర ఱవర్‌ఱఅఫ్‌ఱశీఅం ఈ ఒప్పందం విలువ రూ.3,800 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా రోల్స్-రాయిస్‌తో జట్టుకట్టినట్టు, తద్వారా గ్లోబల్ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహ దం చేయనున్నదని కంపెనీ సీఈవో, ఈడీ సునీల్ కుమార్ తెలిపారు.

## దేశంలో పబ్లిక్ వైఫై విస్తరణ కష్టమే : ట్రాయ్



**న్యూఢిల్లీ :** ఉచిత వైఫై సర్వీస్ అంచనా.. పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌ విస్తరణలో ప్రధాన మానసిక, ఆర్థిక అడ్డంకిని సృష్టిస్తున్నదని టెలికాం రెగ్యులేటర్ ట్రాయ్ సోమవారం విడుదల చేసిన ఓ కన్సల్టేషన్ పేపర్‌లో అభిప్రాయపడింది. 'భారత్‌లో పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌ వ్యాప్తి'పై తెచ్చిన సంప్రదింపు పత్రంలో.. భారతీయ వినియోగదారులు 4జీ/5జీ మొబైల్ డాటా అధిక ధరల కారణంగా ఇంటర్నెట్ కనెక్టివిటీని దాదాపు విలువలేని వస్తువుగా చూస్తున్నారని, అందుకే మళ్లీ పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్ కోసం కనీసం రూ.5 లేదా రూ.10నైనా ఖర్చు చేసేందుకు వారు ఎంతమాత్రం సిద్ధంగా లేరని పేర్కొన్నది. ఈ రకమైన ధోరణి వాణిజ్యపరమైన హాట్‌స్పాట్ ప్రొవైడర్లను ప్రభావితం చేస్తున్నదని చెప్పింది. దాదాపు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు వారి డాటా ప్యాక్‌తోనే సరిపడా ఇంటర్నెట్ వస్తున్నదని గుర్తుచేసింది. కాగా, ట్రాయ్ పేపర్‌పై కామెంట్స్‌కు మే 25 ఆఖరు తేదీ.

# బంగారం.. పెట్టుబడిగానే..

## మారుతున్న మదుపర్ల మైండ్‌సెట్

**ముంబై :** బంగారం అనగానే చాలామందికి టక్కున నగలే ఊహకందుతాయి. అయితే ఇది ఒకప్పటి మాట. గత కొన్నేండ్లుగా కొనుగోలుదారుల మైండ్‌సెట్ మారిపోతున్నది. పుత్తడి అంటే ఇప్పుడు పెట్టుబడులు, అంతకుమించి అన్న సమాధానాలే వారి నుంచి వినిపిస్తున్నాయి మరి. అందుకు తగ్గట్టే గత ఏడాది నమోదైన మొత్తం పసిడి కొనుగోలులో ఆభరణాల వినియోగం వాటా 60 శాతం దిగువకు పడిపోయింది. ఈ మేరకు సోమవారం దేశీయ రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ ఓ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం భారతీయులు గోల్డ్‌ను జ్యుయెల్లరీగా కంటే ఇన్వెస్ట్‌మెంట్‌గానే ఎక్కువగా చూస్తున్నారని చెప్తున్నది.

ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గోల్డ్ బయ్యర్లలో ఈ తరహా వినియోగదారుల వాటా 40 శాతం వరకు ఉండొచ్చని అంటున్నది. పెట్టుబడి కోణంలోనే పసిడిని కొంటారని స్పష్టం చేస్తున్నది. 'దేశీయ బంగారం కొనుగోలు దారుల దృక్పథం మారుతున్నది. అది నిర్మాణాత్మక మార్పును సూచిస్తున్నది. భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, పసిడి ధరల కదలికలు, మదుపర్ల వైవిధ్య పోర్ట్‌ఫోలియోలు.. పెట్టుబడికి బంగారాన్ని అనువుగా మార్చేస్తున్నాయి. పుత్తడి కొనుగోలులో ఈ ఆర్థిక సంవత్సరం 35-40 శాతం మదుపు కోసమే కొనేవారు ఉండవచ్చు' అని కేర్‌ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అన్నారు. దేశంలో పసిడిని నగలుగా వినియోగించేందుకు కొనేవారు 60 శాతంగా ఉంటే.. ప్రపంచ సగటు 50 శాతంగా ఉన్నట్టు తెలిపారు.

**సెంటిమెంట్..**

నిజానికి సంప్రదాయ పసిడి కొనుగోలుదారులు ఎక్కువగా ఉన్న భారత్‌లో.. బంగారాన్ని ఆధ్యాత్మిక కోణంలో చూడటం అధికం. పుత్తడిని లక్ష్మీదేవికి ప్రతిరూపంగా భావిస్తారు. అందుకే నగల రూపంలో ఉన్న బంగారం.. భారత్‌లో ఇప్పటికీ అలాగే ఉంటూ వస్తున్నది. సదరు ఆభరణాలను అమ్మడానికో, కరిగించడానికో కూడా అంగీకరించని కుటుంబాలున్నాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. వారంతా వాటిని తరతరాల వారసత్వ ఆస్తిగానే చూస్తారు.



ధరలు పెరుగుతున్నా.. నిరుడు భారతీయ ఆభరణాల డిమాండ్ స్థిరంగా ఉండటమే ఇందుకు నిదర్శనం. గతంతో పోల్చితే 10 శాతం ఎగసి రూ.4.8 లక్షల కోట్లకు చేరింది. అయినప్పటికీ గోల్డ్ ఎక్సేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)తోపాటు బంగారం కడ్డీలు, నాణేలకు సైతం డిమాండ్ పెరుగుతున్నదని మార్కెట్ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు.

**పదేండ్లలో గరిష్ఠం**

గత ఏడాది భారతీయ పసిడి పెట్టుబడుల డిమాండ్ దశాబ్దకాలం గరిష్ఠాన్ని తాకిందని కేర్‌ఎడ్జ్ తెలియజేసింది. 2025లో గోల్డ్ ఎక్సేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు 37.5 టన్నుల మేర పెరిగాయన్నది. గడిచిన పదేండ్లలో వచ్చిన మొత్తం పెట్టుబడులను ఇది మించిపోయినట్టు కేర్‌ఎడ్జ్ తెలిపింది. ఇదిలావుంటే గత ఆర్థిక సంవత్సరం (2025-26) స్టాక్ మార్కెట్లలో నమోదైన భారీ జ్యుయెల్లర్స్ రెవెన్యూ దాదాపు 35 శాతం పెరిగి ఉండవచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా వేస్తున్నది.

**భారీగా పెరిగిన వెండి ధర**

ఢిల్లీ రిటైల్ మార్కెట్‌లో కిలో వెండి ధర సోమవారం రూ.3,500 పెరిగింది. రూ.2,50,500కు చేరినట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది. మరోవైపు 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు పుత్తడి రేటు రూ.200 పెరిగి రూ.1,56,100గా నమోదైంది. ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ రూ.300 దిగి రూ.1,40,900గా ఉన్నది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 4,704 డాలర్లు, సిల్వర్ 75.60 డాలర్లు పలికాయి.

## ఎన్‌ఎస్‌ఈలో 13 కోట్లు దాటిన ఇన్వెస్టర్లు

**న్యూఢిల్లీ :** దేశంలో పురాతన స్టాక్ ఎక్సేంజ్‌ల్లో ఒకటైన నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌ఈ) పెట్టుబడిదారులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఈలో రిజిస్టర్డ్ అయిన ఇన్వెస్టర్ల సంఖ్య 13 కోట్లు దాటారని సంస్థ వెల్లడించింది. క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం వల్లనే ఈ కీలక మైలురాయికి చేరుకున్నట్టు తెలిపింది. సెప్టెంబర్ 2025లో 12 కోట్ల మార్క్ దాటిన ఎన్‌ఎస్‌ఈ..మళ్లీ ఏడు నెలల తర్వాత మరో కోటి మంది పెరుగడం విశేషం. మరోవైపు, ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 25 కోట్లుగా ఉన్న క్లయింట్లు..ఏప్రిల్ చివరినాటికి 25.7 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది. తొలి కోటి మంది ఇన్వెస్టర్లకు చేరుకోవడానికి 14 ఏండ్లు పట్టగా, మరో మూడు కోట్లకు చేరుకోవడానికి మరో 11 ఏండ్లు పట్టింది. ఇటీవల కాలంలో ఆరు నుంచి ఎనిమిది నెలల్లోనే కోటి మంది జతవుతున్నారని పేర్కొంది.




# తల్ల'డిల్లి'పోయింది



పంజాబ్ కింగ్స్‌పై బ్యాట్లు విరిగేలా బాదేసి 264 పరుగులు చేసింది దిల్లీ. కానీ రెండు రోజుల వ్యవధిలో కుదేలైపోయింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై అదే దిల్లీ బ్యాటెత్తేసింది. ఔటైపోవడానికి పోటీ ఏమైనా జరుగుతుందా అన్నట్లు ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ చేరిపోయారు దిల్లీ బ్యాటర్లు. హేజిల్‌వుడ్, భువనేశ్వర్ దెబ్బకు పవర్‌ప్లేలోనే 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి, 75 పరుగులకే ఆలౌటైపోయి ఘోర పరాభవం మూటగట్టుకుంది దిల్లీ. మ్యాచ్ తొలి అరగంటలోనే ఆ జట్టు ఓటమి దాదాపుగా ఖాయమైపోయింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆర్సీబీకి ఇది ఆరో విజయం. దిల్లీ అయిదో ఓటమి చవిచూసింది.

బెంగళూరుకు అదిరే విజయం.. దిల్లీకి దిమ్మతిరిగే ఓటమి! ఆర్సీబీ బౌలర్లు వీర ప్రతాపం చూపించిన వేళ దిల్లీకి మరో పరాజయం ఎదురైంది. సోమవారం ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో డీసీని చిత్తు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేజిల్‌వుడ్ (4/12), భువనేశ్వర్ (3/5) ధాటికి మొదట దిల్లీ 16.3 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది. సుయాశ్ శర్మ (1/7), రసిఖ్ సలామ్ (1/21), కృనాల్ పాండ్య (1/9) కూడా ప్రత్యర్థి పతనంలో తమ వంతు పాత్ర పోషించారు. అభిషేక్ పోరెల్ (30; 33 బంతుల్లో 3x4), మిల్లర్ (19), జేమీసన్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ 6.3 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి అలవోకగా ఛేదించింది. పడిక్కల్ (34 నాటౌట్; 13 బంతుల్లో 3x4, 3x6), విరాట్ కోహ్లి (23 నాటౌట్; 15 బంతుల్లో 1x4, 2x6), బెతెల్ (20; 11 బంతుల్లో 1x4, 2x6) రాణించారు.

**దిల్లీ టపటపా..:**

దిల్లీ ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. భువనేశ్వర్, హేజిల్‌వుడ్ దెబ్బకు టపటపా వికెట్లు పడిపోయాయి. బ్యాటర్లకు ప్యాడ్లు కట్టుకునే టైమ్ కూడా ఇవ్వకుండా వికెట్ మీద వికెట్ తీస్తూ దిల్లీని వణికించారీ పేసర్లు. బంతి ఎక్కడ పడి ఎక్కడికి వెళ్తుందో తెలియక దిల్లీ బ్యాటర్లు వికెట్లు సమర్పించుకున్నారు. పతనాన్ని ఆరంభించింది మాత్రం భువీనే. తొలి ఓవర్లో ఓ అద్భుతమైన స్వింగింగ్ డెలివరీతో అరంగేట్ర బ్యాటర్ సాహిల్ పరాఖ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడతను. ఆ తర్వాతి ఓవర్లో గత మ్యాచ్ సెంచరీ హీరో కేఎల్ రాహుల్ (1), సమీర్ రిజ్వి (0)లను వరుస బంతుల్లో ఔట్ చేసి దిల్లీకి డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు హేజిల్‌వుడ్. దిల్లీ పతనం అక్కడితో ఆగలేదు. మూడో ఓవర్లో భువి మరింత రెచ్చిపోయాడు. స్టబ్స్ (5), అక్షర్ పటేల్ (0) వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత నితీశ్ రాణా (1).. హేజిల్‌వుడ్ బుట్టలో పడడంతో 4 ఓవర్లకు 9/6తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది డీసీ. ఐపీఎల్‌లో అత్యల్ప స్కోరు చేసిన బెంగళూరు (49 పరుగులు) రికార్డు బద్దలవుతుందా అనిపించిన సమయమది. కానీ మిల్లర్, అభిషేక్ పోరెల్ పోరాటంతో దిల్లీకి ఆ అపప్రథ తప్పింది. ఏడో ఓవర్లో అభిషేక్, మిల్లర్ చెరో బౌండరీ కొట్టడంతో స్కోరు కాస్త కదిలింది. 8.5 ఓవర్లకు 43/6తో నిలిచింది దిల్లీ. కానీ ఓ షాట్ ఆడబోయి మిల్లర్ ఔట్ కావడంతో ఆ జట్టు పతనం మళ్లీ షురూ అయింది. ఆపై ఇన్నింగ్స్ మరో ఏడు ఓవర్లలోనే ముగిసింది. గొప్పగా బౌలింగ్ చేసిన హేజిల్‌వుడ్, భువి చెరో 15 డాట్ బాల్స్ వేయడం విశేషం. స్పిన్నర్ సుయాశ్ (1/7) ఏకంగా 20 డాట్ బాల్స్ వేశాడు. దీపక్ చాహర్ పేరిట ఉన్న అత్యధిక డాట్ బాల్స్ రికార్డును సమం చేశాడు.

**ఆర్సీబీ 39 బంతుల్లోనే..:**

స్వల్ప ఛేదనను బెంగళూరు 39 బంతుల్లోనే పూర్తి చేసింది. దిల్లీ దారుణంగా తడబడిన పిచ్ బెంగళూరు ఓపెనర్లు కోహ్లి, బెతెల్ ఏమాత్రం కష్టపడలేదు. జేమీసన్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సులు బాదిన బెతెల్ ఔటైనా.. కోహ్లి, పడిక్కల్ దూకుడుగా ఆడారు. ముఖ్యంగా పడిక్కల్ వస్తూనే భారీషాట్ల వేటలో సాగాడు. జేమీసన్ వేసిన అయిదో ఓవర్లో అతడు 2 సిక్సులు, 2 ఫోర్లు బాదడంతో స్వల్ప లక్ష్యం మరింత చిన్నబోయింది. ఆ తర్వాత నటరాజన్ బౌలింగ్‌లో కోహ్లి వరుసగా రెండు సిక్సులు బాదడంతో ఆర్సీబీ విజయం పూర్తయింది. ఆ జట్టు ఏకంగా 81 బంతులు మిగిలుండగానే ఛేదన పూర్తి చేసింది. ఐపీఎల్‌లో ఇది రెండో అత్యంత వేగవంతమైన ఛేదన.


ఐపీఎల్‌లో 9 వేల పరుగుల మైలురాయిని అందుకున్న తొలి బ్యాటర్‌గా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. దిల్లీతో మ్యాచ్‌లో 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అతడు.. 9000 పూర్తి చేశాడు. ఇందుకోసం అతడు 267 ఇన్నింగ్స్ ఆడాడు. దిల్లీపై కోహ్లి అజేయంగా 23 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లి తర్వాతి స్థానంలో రోహిత్ శర్మ (7183) ఉన్నాడు. శిఖర్ ధావన్ (6769)ది మూడో స్థానం.

పవర్‌ప్లేలో దిల్లీ స్కోరు. ఐపీఎల్ చరిత్రలో తొలి 6 ఓవర్లలో ఒక జట్టు చేసిన అత్యల్ప స్కోరు (13/6) ఇదే.

దిల్లీ ఇన్నింగ్స్: సాహిల్ పరాఖ్ (బి) భువనేశ్వర్ 0; రాహుల్ (సి) జితేశ్ (బి) హేజిల్‌వుడ్ 1; నితీశ్ రాణా (సి) పడిక్కల్ (బి) హేజిల్‌వుడ్ 1; సమీర్ రిజ్వి (సి) జితేశ్ (బి) హేజిల్‌వుడ్ 0; స్టబ్స్ (సి) పడిక్కల్ (బి) భువనేశ్వర్ 5; అక్షర్ పటేల్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 0; అభిషేక్ పోరెల్ (బి) హేజిల్‌వుడ్ 30; మిల్లర్ (సి) జితేశ్ (బి) రసిఖ్ 19; జేమీసన్ ఎల్బీ (బి) కృనాల్ 12; కుల్‌దీప్ (బి) సుయాశ్ 3; చమీర నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (16.3 ఓవర్లలో ఆలౌట్) 75; వికెట్ల పతనం: 1-0, 2-2, 3-2, 4-7, 5-7, 6-8, 7-43, 8-62, 9-71; బౌలింగ్: భువనేశ్వర్ 3-0-5-3; హేజిల్‌వుడ్ 3.3-0-12-4; రసిఖ్ సలామ్ 2-0-21-1; రొమారియో షెపర్డ్ 2-0-21-0; సుయాశ్ శర్మ 4-1-7-1; కృనాల్ 2-0-9-1

బెంగళూరు ఇన్నింగ్స్: బెతెల్ (సి) నటరాజన్ (బి) జేమీసన్ 20; కోహ్లి నాటౌట్ 23; దేవదత్ పడిక్కల్ నాటౌట్ 34; ఎక్స్‌ట్రాలు 0 మొత్తం: (6.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 77; వికెట్ల పతనం: 1-26; బౌలింగ్: జేమీసన్ 3-0-42-1; చమీర 2-0-18-0, అక్షర్ పటేల్ 1-0-5-0, నటరాజన్ 0.3-0-12-0

# రఘువంశీకి జరిమానా



**లఖ్‌నవూ:** కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్ ఆంగ్‌క్రిష్ రఘువంశీకి జరిమానా పడింది. ఆదివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్‌గా అంపైర్ ఔట్ ఇవ్వడంతో ఈ యువ బ్యాటర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. పెవిలియన్ చేరాక హెల్మెట్, బ్యాట్‌ను విసిరి కొట్టాడు. దీంతో ఐపీఎల్ ప్రవర్తన నియమావళిని మీరినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత పడింది. "రఘువంశీ ఐపీఎల్ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించాడు. క్రికెట్ పరికరాలను విసిరేయడం నిబంధనలకు వ్యతిరేకం. అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధిస్తున్నాం" అని ఐపీఎల్ అధికారులు తెలిపారు. కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ప్రిన్స్ యాదవ్ వేసిన అయిదో ఓవర్లో రఘువంశీ.. మిడాన్ దిశగా బంతిని ఆడి సింగిల్ కోసం ప్రయత్నించాడు. నాన్‌స్ట్రైకింగ్‌లో ఉన్న గ్రీన్.. ఈ పరుగు తీయడానికి నిరాకరించాడు. కుడి వైపు నుంచి పరుగు మొదలుపెట్టిన రఘువంశీ.. వెనక్కి వెళ్లే ప్రక్రియలో దిశను మార్చుకుని ఎడమ వైపునకు పరుగెత్తాడు. ఈ క్రమంలో ఫీల్డర్ వేసిన బంతి అతడి కాళ్లకు తగలడంతో ఎల్‌ఎస్‌జీ కెప్టెన్ పంత్ అప్పీల్ చేశాడు. దీంతో అంపైర్.. రఘువంశీని 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'గా ఔట్ ఇచ్చాడు.

# ఓటమితో ముగించిన అమ్మాయిలు



**బెనొని :** మరికొద్దిరోజుల్లో ఇంగ్లండ్ వేదికగా జరుగబోయే మహిళల టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను భారత జట్టు ఓటమితో ముగించింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నాలుగో మ్యాచ్‌లో గెలిచినా ఇరుజట్ల మధ్య సోమవారం జరిగిన ఐదో టీ20లో 23 పరుగుల తేడాతో ఓటమిని మూటగట్టుకుంది. తొలుత దక్షిణాఫ్రికా.. కెప్టెన్ లారా వోల్వార్ట్ (56 బంతుల్లో 92 నాటౌట్, 11 ఫోర్లు, 2 సిక్సులు) పోరాటంతో 20 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 155 రన్స్ చేసింది. భారత బౌలర్లలో రేణుకా (2/21), శ్రీ చరణి (2/22), దీప్తి (2/37) తలా రెండు వికెట్లు పడగొట్టారు. స్వల్ప ఛేదనే అయినప్పటికీ ఉమెన్ ఇన్ బ్లూ.. నిర్ణీత ఓవర్లలో 132/8 వద్దే ఆగిపోయింది. ఫల్మలి (40), రిచా ఘోష్ (25 నాటౌట్) పోరాటం సరిపోలేదు. ఈ గెలుపుతో సిరీస్‌ను దక్షిణాఫ్రికా 4-1తో గెలుచుకుంది. సిరీస్‌లో 330 పరుగులు చేసిన వోల్వార్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులూ దక్కాయి.

# తెలంగాణలోనూ... బంక్ ముందు క్యూ...

## వార్తలను ఖండించిన పౌర సరఫరాల శాఖ

**హైదరాబాద్ :** తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను పౌర సరఫరాల శాఖ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని.. ప్రజలు ఆందోళనతో బంకుల వద్ద క్యూ కట్టవద్దని స్పష్టం చేసింది. ప్రతిరోజూ సుమారు 24 వేల కిలోలీటర్ల చమురు, 2.22 లక్షల గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా జరుగుతోందని గణాంకాలతో వివరించింది. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది తెలంగాణలో ఇంధన నిల్వలకు సంబంధించి గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడనుందనే వార్తలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ వాస్తవ పరిస్థితిని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా చమురు, ఎల్పీజీ (ఒఖఉ) గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని సరఫరా వ్యవస్థలో ఎలాంటి ఆటంకాలు లేవని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. వదంతుల కారణంగా ప్రజలు ఒకేసారి పెట్రోల్ బంకుల వద్దకు రావడంతో అనవసర రద్దీ ఏర్పడుతోందని, ఇది కృత్రిమ కొరతకు దారితీసే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పౌర సరఫరాల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. తెలంగాణలో ప్రతిరోజూ సగటున 24 వేల కిలోలీటర్ల చమురు వినియోగం జరుగుతోంది. ఇందులో 9,574 కిలోలీటర్ల పెట్రోల్, 14,457 కిలోలీటర్ల డీజిల్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోంది. గ్యాస్ సిలిండర్ల విషయంలోనూ ఎలాంటి ఇబ్బంది లేదని.. రోజుకు 2.22 లక్షలకు పైగా సిలిండర్ల పంపిణీ జరుగుతోందని అధికారులు వెల్లడించారు. ఆయిల్ రిఫైనరీల నుండి డిపోలకు, అక్కడి నుండి బంకులకు చేరే సరఫరా గొలుసు అత్యంత పటిష్టంగా ఉందని, ఎక్కడా అంతరాయం లేదని ప్రభుత్వం హామీ ఇచ్చింది.




ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవాలను నమ్మి ఆందోళన చెందవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ విజ్ఞప్తి చేసింది. ఒకవేళ ఎవరైనా కావాలని కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇంధన సరఫరాకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు లేదా అనుమానాలు ఉంటే వినియోగదారులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. కాగా, అధికారుల వాదన ఇలా ఉంటే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఖమ్మం, మహబూబాబాద్ వంట జిల్లాల్లో వాహనదారులు పెట్రోల్ బంకుల ముందు బారులు తీరారు. ఇక హైదరాబాద్ శివారు పెట్రోల్ బంకుల్లోనూ చాలా చోట్ల సరిపడా స్టాక్ ఉండటం లేదు. కొన్ని బంకుల్లో పెట్రోల్ ఉంటే డిజీల్ లేకపోవటం.. డీజిల్ ఉంటే పెట్రోల్ లేకపోవటం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మరికొన్ని బంకులు నో స్టాక్ బోర్డులు పెట్టి పూర్తిగా మూసేశాయి. దీనికి కారణం ఆయిల్ కంపెనీలకు ముందస్తు చెల్లింపులేనని బంకుల యజమానులు చెబుతున్నారు. ఏది ఏమైనా వాహనాల్లో ఇందనం నింపుకునేందుకు వాహనాదారులు బంకుల ముందు బారులు తీరటం మాత్రం తప్పటం లేదు.

## కొత్త మలుపు తీసుకుంటున్న అషురెడ్డి

**హైదరాబాద్ :** బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డిపై వచ్చిన రూ.9.5 కోట్ల మోసం ఆరోపణల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. ఈ వివాదంపై అషురెడ్డి తండ్రి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా మీడియా ముందుకొచ్చి సంచలన విషయాలు వెల్లడించారు. తన కూతురు అమాయకురాలని, అసలు తప్పు అవతలి వారిదేనని ఆయన పేర్కొన్నారు. అషురెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి అన్ని విషయాలు వివరిస్తుందని తెలిపారు. వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "2021లో కాకినాడ నుంచి సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్ చేసి, అషురెడ్డికి పెళ్లి సంబంధం గురించి మాట్లాడారు. మా అమ్మాయి గురించి మీకెలా తెలుసు అని అడిగాను. మీ అమ్మాయికి, మా అబ్బాయి ధర్మేంద్రకు ఉద్యోగం చేసే దగ్గర పరిచయం అని ఆయన చెప్పారు. అయితే, మేము తెలిసిన వారి ద్వారా విచారించగా కొన్ని నిజాలు తెలిశాయి. అప్పటికే ధర్మేంద్రకు పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని, తండ్రి సత్యనారాయణ నడుపుతున్న ఫైనాన్స్ కంపెనీపై కాల్ మనీ కేసు ఉందని తెలిసింది. దీంతో ఈ సంబంధం వద్దని నిర్ణయించుకున్నాం" అని వెంకటకృష్ణారెడ్డి వివరించారు. ఆ తర్వాత వారి గురించి మళ్లీ ఇప్పుడే వింటున్నామని ఆయన అన్నారు. తన కూతురు తల్లి ప్రోత్సాహంతోనే ఇండస్ట్రీలోకి వచ్చిందని, ఆమెకు బయట ప్రపంచం గురించి పెద్దగా తెలియదని వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. "మా అమ్మాయి అమాయకురాలు. ఆమెపై వచ్చిన ఆర్థిక ఆరోపణల్లో వాస్తవం లేదు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. ఒకవేళ ఉంటే నిరూపించుకోవాలి" అని ఆయన సవాల్ విసిరారు. ప్రస్తుతం అషురెడ్డి వేరే ఊరిలో ఉందని, ఈ రాత్రికల్లా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, ఈ వివాదం వెనుక ఉన్న అసలు నిజాలను అషురెడ్డే స్వయంగా వెల్లడిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో అషురెడ్డి ఏం చెప్పబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## డీజిల్ అయిపోయిందని నిర్లక్ష్యం

**హైదరాబాద్ :** ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యతను మరిచి, నడిరోడ్డుపై వారిని గాలికొదిలేయడం హాట్ టాపిక్ అవుతోంది. హైదరాబాద్ నుండి పాలకొల్లు వెళుతున్న 'వర్మ ప్రైవేటు ట్రావెల్స్' బస్సులో ప్రయాణించిన వారికి ఈ చేదు అనుభవం ఎదురైంది. బస్సు విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం చేరుకోగానే ఒక్కసారిగా నిలిచిపోయింది. బస్సు ఆగిపోవడంతో ఆందోళన చెందిన ప్రయాణికులు డ్రైవర్‌ను నిలదీయగా, బస్సులో డీజిల్ అయిపోయిందని అతను సమాధానం ఇచ్చాడు. అంతటితో ఆగకుండా, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సింది పోయి, డ్రైవర్ వారిని రోడ్డు మీద వదిలేసి అక్కడి నుండి పారిపోయాడు. ఆ తర్వాత అతను తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ముందుగానే ఫ్యూయల్ ఉందో లేదో చూసుకోకుండా ట్రావెల్స్ బస్సును ఎందుకు నడిపారని యాజమాన్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జర్నీ మధ్యలోనే ఉండటంతో గమ్యస్థానాలకు చేరేందుకు ప్రయాణికులు ఆ ట్రావెల్స్ యజమానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ట్రావెల్స్ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్థరాత్రి వేళ చిన్నపిల్లలు, వృద్ధులతో సహా ప్రయాణికులంతా రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రైవేటు ఆపరేటర్ల బాధ్యతారాహిత్యంపై ప్రయాణికులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా తలెత్తిన పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నో స్టాక్ బోర్డులతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదివారం రాత్రి ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, కలెక్టర్లతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నాడు రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత ఉండకూడదని, ప్రతి బంకులోనూ నిల్వలు అందుబాటులో ఉంచాలన్నారు. కానీ సోమవారం సైతం వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపిస్తుండగా.. కొన్ని బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూ లైన్లు ఉంటున్నాయి.

# ఎరువుల దుకాణాల బంద్ విజయవంతం



డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి
ది తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు

**వరంగల్ :** డీలర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఎరువులు, పెస్టిసైడ్స్, విత్తనాల దుకాణాలు బంద్ నిర్వహించారు. జాతీయ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ ఆందోళన చేపట్టినట్లు ది తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ జిల్లా అసోసియేషన్ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎరువుల కంపెనీలు అన్ని ఫ్రాయిట్ ఆన్ లొకేషన్ (ఎఫ్ఓఎల్) విధానం అమలు పరిచి అలాగే యూరియా, కాంప్లెక్స్ ఎరువులపై లింక్ ప్రొడక్ట్స్ ను అంటగట్టి, బలవంతపు విక్రయం, హెచ్‌టి బీటీ కాటన్, ఎక్స్‌పైరీ స్టాక్స్ వంటి సమస్యలు డీలర్లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. డీలర్ ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేం దుకు ఈ రోజు బంద్ నిర్వహించడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎరువుల కంపెనీలు అన్నీ కూడా ఎఫ్ఓఎల్ ఇవ్వకుండా డీలర్లను మోసం చేస్తున్నాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విచ్చలవిడిగా లైసెన్స్ ఇవ్వకుండా చూడాలని, బినామీ పేర్లతో ఉన్నటువంటి లైసెన్స్ లు రద్దు చేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన పెంపొందించాలని, అవగాహన ఉన్నటువంటి వ్యక్తులకు అదే విధంగా కంపెనీలకు మాత్రమే లైసెన్స్ ఇవ్వాలనేటువంటిది తమ ప్రధానమైనటువంటి డిమాండ్ అన్నారు. డీలర్స్ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే రేక్ పాయింట్ కారణంగా సుదూర ప్రాంతాలకు సరుకు రవాణా చేయాల్సి రావడంతో ట్రాన్స్పోర్ట్ చార్జీలు పెరిగి డీలర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్క్‌ఫెడ్‌కు ఎఫ్ఓఎల్ సౌకర్యం ఉన్నప్పటికీ డీలర్లకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్లకు లింక్ ప్రొడక్ట్స్ బలవంతంగా మోపుతున్న కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉపయోగపడని విత్తనాలు, మందుల విషయంలో డీలర్లపై కాకుండా తయారీ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లోకి హెచ్‌టి బీటీ విత్తనాలు చేరకుండా, ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్రభుత్వం పోలీసులతో కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర సీఎం, వ్యవసాయశాఖ మంత్రిని కలిసి డీలర్ల సమస్యలపై వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నటువంటి డీలర్లను అభినందించాల్సింది పోయి కంపెనీలు కర్కషంగా వ్యవహరిస్తున్నాయన్నారు. మార్క్‌ఫెడ్ లో 60 శాతం ప్రభుత్వం, 40శాతం ప్రైవేటు డీలర్స్ కు ఇవ్వడం జరుగుతుంది. 60 శాతం వాటికి లింకులు ఎటువంటివి ఇవ్వడం అవసరం లేదు, కానీ ప్రైవేటు అనగా డీలర్స్ కి ఇచ్చేటువంటి 40 శాతం వాటికి మాత్రం లింకుల పేరుతో డీలర్స్ ను అయోమాయానికి గురి చేయడము డీలర్స్ ను నష్టపరిచే విధంగా అనేక ఇబ్బందులకు గురకావడం జరుగుతుందన్నారు. దీనిపైన ప్రభుత్వం వెంటనే స్పందించి, స్పష్టమైన సమాచారం సేకరించి కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ ఎఫ్ఓఏల్ లకు ఎటువంటి అభ్యంతరం లేదు కానీ ప్రైవేటుకు ఇచ్చేటువంటి వాటిలో ఈ కంపెనీలు అనేక విధాలుగా మోసం చేస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను లైసెన్సు ఉన్నటువంటి

## కాంగ్రెస్, బీజేపీలను పారద్రోలుతాము

**హైదరాబాద్ :** కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టారని అన్నారు. 14 సంవత్సరాల పాటు తెలంగాణ కోసం కేసీఆర్ పోరాటం చేశారని, ఆ తర్వాత పదేళ్లు మంచి పాలన అందించారని అన్నారు. దశాబ్దాలుగా దగాపడ్డ తెలంగాణ కోసం అన్ని పదవులు వదులుకొని, 25 సంవత్సరాల క్రితం ఇదే రోజు జలదృశ్యంలో కేసీఆర్ పార్టీని స్థాపించారని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమించి, తెలంగాణ ప్రజలను, జాతిని ఐక్యం చేసి ఢిల్లీ మెడలు వంచారని అన్నారు. తెలంగాణను సాధించాక ప్రజలు అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన పెట్టిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం ఈ రెండున్నరేళ్ళలుగా ఈ దుర్మార్గపు పాలనలో అణచివేతలకు గురవుతున్న ప్రజలకు బీఆర్ఎస్ గొంతుకై నిలుస్తోందని అన్నారు. ఉద్యమ పార్టీగా, 10 ఏళ్లు అధికార పార్టీగా, రెండున్నరేళ్లు ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఇచ్చిన ప్రతి పాత్రను బీఆర్ఎస్ సమర్థవంతంగా పోషిస్తోందని అన్నారు.

**తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిన ప్రపంచానికి అందించింది: హరీశ్ రావు**

బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని, ఇది ఒక విప్లవమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 26వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండా ఈరోజుతో పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం రెపరెపలాడుతూసిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకను జరుపుకుంటున్న సన్నివేశం ఇది అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల మైలురాయిని అధిగమించిన మహోజ్వల లాంగ్ మార్చ్ అని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు, నాయకులకు, ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కవితారూపంలో పార్టీ గురించి ట్వీట్ చేశారు. "నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసి విప్లవ శంఖం మోగించిన ధిక్కార వేదిక, సమైక్య సంకెళ్లను తెంచి స్వరాష్ట్ర కాంక్షను సాకారం చేసిన యుద్ధ గీతిక, పదేళ్ల పాలనతో ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిన అభివృద్ధి పతాక, తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గులాబీ దీపిక, ప్రజల విశ్వాసానికి ప్రతీక, ప్రజా ఉద్యమ పతాక.. భారత రాష్ట్ర సమితి 26 వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ రాసుకొచ్చారు




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana.
Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com